ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
సోమవారం 4 ఆగస్టు 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 26.0

ఎంపీఎస్‌లలో తరగతికో టీచర్ని ఇవ్వరేం..!

▸ ఏపీటీఎఫ్ సమావేశంలో నాయకులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి చేసి బోధనకే పరిమితం చేయాలని ఆదివారం ఏలూరులో జరిగిన ఏపీటీఎఫ్-1938 జిల్లా కార్యవర్గ సమావేశంలో సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సంఘ నాయకులు జి.కృష్ణ, రామ్మోహనరావు మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ స్కూళ్ల (ఎంపీఎస్)కు తరగతికో టీచరును ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు మాటమార్చి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ప్రకారమే ఉపాధ్యాయులను నియమించిందని ఎద్దేవా చేశారు. జడ్పీ యాజమాన్యంలో స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో నియమితులైనవారు రిటైరయ్యే నాటికి హెచ్‌ఎం ప్రమోషన్‌కే పరిమితమవుతుండడం విచారకరమన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్ల ఏకీకృత సర్వీసులను పార్లమెంటులో చట్టబద్ధం చేయడానికి సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులపై అక్రమంగా బనాయించిన పోలీసు కేసులను ఎత్తివేయాలన్నారు. ఇటీవల గౌరవ డాక్టరేట్‌ను తీసుకున్న కృష్ణను సంఘ నాయకులు సత్కరించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, ప్రసాద్, దుర్గారావు, అప్పారావు, కృష్ణమూర్తి, రాజు, రమేష్, ప్రకాష్ పాల్గొన్నారు.


బాలికల వసతి గృహంలో తనిఖీ అనంతరం మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు

బీసీ వసతి గృహాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

▸ బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు

ఏలూరు,ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బీసీ వసతి గృహాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ డి.చంద్రశేఖర్‌రాజు పేర్కొన్నారు. ఏలూరు నగరంలోని బీసీ సంక్షేమ హాస్టళ్లను ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమీనాపేటలోని బీసీ బాలికల వసతి గృహం-1,2 కేంద్రాలను తనిఖీలు చేసి, రికార్డులను పరిశీలించారు. భోజనాలను ఆయన రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్స్‌లో మెగా క్లీన్‌అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణిం చాలన్నారు. వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచేలా నడుచుకోవాలని సూచించారు. ఆయన వెంట బీసీ సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి, వసతి సంక్షేమాధికారి వెంకటేశ్వరులు ఉన్నారు.

సహకారం.. బలోపేతం!



సొసైటీల పునర్వ్యవస్థీకరణకు కసరత్తు

సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. కేంద్రం సహకార వ్యవస్థలో ఏకీకృతం చట్టం తీసుకురాగా, రాష్ట్రంలో సంఘాల్లో పారదర్శకతకు సొసైటీల కంప్యూటరీకరణ పూర్తి చేసి, రైతులకు ఆన్‌లైన్ సేవలను తెలుగుదేశం ప్రభుత్వం విస్తరిం చింది. మరో ముందడుగు వేసి సహకార సంఘాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు ప్రారంభమయ్యాయి. దీనికి రాష్ట్రస్థాయిలో కమిటీని ప్రభుత్వం గత నెలలో నియమించింది. దీంతో సొసైటీల విస్తరణ, విభజన జరగనుంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

▸ పెరగనున్న సహకార సంఘాల సంఖ్య
▸ ప్రస్తుతం జిల్లాలో 153 సంఘాలు..
▸ ఈ సంఖ్య 200కు పెరిగే అవకాశం
▸ పాల ఉత్పత్తి, ఫిషర్‌మెన్ సొసైటీలకు ప్రాధాన్యం
▸ రైతులకు మరింత చేరువగా సేవల విస్తరణ

స్థానిక రైతుల పంట అవసరాలకు అనుగుణంగా రుణాలు, విత్తనాలు, పురుగు మందులను సకాలంలో అందించేందుకు సహకార వ్యవస్థలో సొసైటీలు చేసే సేవలు నిరుపమానం. అయితే గత పాలకులు వైఫల్యాలు, పర్యవేక్షణ లేమితో సొసైటీలు అన్ని మండలాల్లో ఒకే రీతిన లేవు. దీనికి తోడు ఒక మండలంలో ఒక్క సొసైటీ ఉంటే, కొన్ని మండలాల్లో ఏడు నుంచి 10 వరకు ఉన్నాయి. ఒక మండల పరిధిలో 20కి పైగా గ్రామాలున్నా.. ఒకటే సంఘం ఉంది. దీంతో అక్కడి రైతులు పీఏసీఎస్‌ల్లో అవసరాల కోసం 10 నుంచి 20 కిలోమీటర్ల ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో రైతుల సేవలు సక్రమంగా అందడం లేదు. దీంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పునర్వ్యవస్థీకరణ సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో కొత్త పీఏఎస్‌ల ఏర్పాటుపై మండల, జిల్లా స్థాయిల్లోనూ కూటమి పార్టీ నేతల్లో చర్చ మొదలైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005లో పీఏసీఎస్‌లను పునర్వ్యవస్థీకరించారు. అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతుల అవసరాల కంటే పార్టీ ప్రయోజనాలకే పెద్దపీట వేసిందన్న విమర్శలున్నాయి. ఈ దఫా పునర్వ్యవస్థీకరణలో మండల పరిధి, రైతుల సంఖ్య, స్థానిక అవసరాలు దృష్టిలో పెట్టుకోవాలన్న విజ్ఞప్తులు వస్తున్నాయి. 2023లో వైసీపీ హయాంలోను పీఏఎస్ఎస్‌ల పునర్వ్యవస్థీకరణ అంశం తెరపైకి వచ్చింది. మూడు రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఒక సొసైటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అది సాధ్యం కాదని పక్కన పెట్టారు. నాబార్డు నిబంధనల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా పీఏసీఎస్‌లను నిర్మాణాత్మక పద్ధతిలో విభజించడం కోసం, సాధ్యాసాధ్యాలను అంచనా వేయడానికి రాష్ట్రస్థాయి కమిటీని ప్రభుత్వం నియమించింది. దీనికి సహకారశాఖ కమిషనర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆప్కాబ్ ఎండీ మెంబర్ కన్వీనర్‌గా, నాబార్డు సీజీఎం, కృష్ణా డీసీసీబీ, చిత్తూరు డీసీసీబీల సీఈవోలు మెంబర్లుగా నియమించారు. వ్యవసాయ విస్తీర్ణం, రైతులు, మౌలిక వసతులను ఆధారంగా ప్రతీ గ్రామంలోను లేదా మూడు గ్రామాలకు కలిపి ఒక్క సొసైటీ అయినా ఏర్పాటు చేసే దిశగా సర్వేలకు రంగం సిద్ధం చేశారు. ఏలూరు (మిగతా 8వ పేజీలో)



భార్యపై హత్యాయత్నం చేసిన భర్తకు ఎనిమిదేళ్ల జైలు, జరిమానా

ఆరేళ్ల క్రితం మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు

▸ మరో వివాహం చేసుకుని హైదరాబాద్‌లో నివాసం

■ లోపలి పేజీలో..

పరీక్ష కేంద్రాల బయటే

పాదరక్షలు వదిలి..

▸ ఓ కేంద్రంలో అపరిశుభ్రంగా వాష్‌రూమ్‌లు ..
▸ కనీసం నీటివసతిని పట్టించుకోలేదు..
▸ నీట్-పీజీ పరీక్షార్థుల పాట్లు!
▸ ఏలూరులో రెండు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
▸ మొత్తం 30 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య ఎండీ, ఎంఎస్, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన నీట్-పీజీ పరీక్షకు హాజరైన అభ్యర్థులకు అతి జాగ్రత్తల మాటున కాళ్లు సుర్రుమనిపించారు. కాపీయింగ్ నిరోధానికి తనిఖీలు, పలు అంచెల్లో అన్ని చర్యలను చేపట్టడం సహజమే అయినా అదికాస్తా పరీక్షార్థులు ధరించిన పాదరక్షలను సైతం తొలగించిన తర్వాతే అనుమతించడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. కాగా జిల్లాకేంద్రం ఏలూరులో జరిగిన నీట్-పీజీ పరీక్షకు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి 200 మంది అభ్యర్థులను కేటాయించగా 181 మంది, సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రానికి 173 మందిని కేటాయించగా 162 మంది హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగానే ముగిసినా వట్లూరు లోని ఓ కేంద్రంలో అభ్యర్థులు కనీస వసతులు లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి కేంద్రంలో వాష్‌రూమ్‌లు అపరిశుభ్రంగా ఉండడంతో పాటు, వాటికి నీటి సరఫరా లేదని వాపోయారు. దీనికితోడు పరీక్షకేంద్రం సెక్యూరిటీ వద్దే పాదరక్షలను వదిలేయాలని ఆదేశించడంతో, అక్కడినుంచి పరీక్షగది వరకు, చివరకు నిర్వహణ సరిగా లేక భయానకంగా వున్న వాష్‌రూమ్‌కు వట్టికాళ్లతోనే వెళ్లాల్సి వచ్చిందని వైద్యవిద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకుముందు జరిగిన నీట్ పరీక్షలకు హాజరైన అభ్యర్థుల పాదరక్షలను వదిలివెళ్లాలనే నిబంధన తాము చూడలేదని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవడానికి అభ్యంతరం లేదని, కానీ పాదరక్షలతో వెళ్లడాన్ని అనుమతించకపోవడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. ఇప్పటివరకు అమలు చేస్తున్న నిబంధనల ప్రకారం పరీక్షార్థులు జడక్లిప్పులు, చెవిదిద్దులు, ఉంగరాలు, తదితర వస్తువులను అనుమతించడం లేదు. దీంతో విద్యార్థినులు జుట్టు విరబోసుకుని రావడం పరీక్షకేంద్రాల వద్ద కనబడేది. కాగా ముందుగా ఎన్‌బీఈ చెప్పిన విధంగానే పరీక్ష ప్రారంభసమయానికి అంటే 9గంటలకు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాల ప్రవేశద్వారాలను మూసివేశారు. దీంతో సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి పావుగంట ఆలస్యంగా ఉదయం 8.45 గంటలకు వచ్చిన ఓ అభ్యర్థిని నిర్వాహకులు అనుమతించలేదు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

ఏలూరు,ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల, డివిజనల్, మునిసిపల్, జిల్లాస్థాయిలో ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఈనెల 4న సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ద్వారా ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాస్థాయిలో అమలవుతున్న ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను వికేంద్రీకరించామని, దీనిని ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. సమీప మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో వినతులు అందించవచ్చని కలెక్టర్ వివరించారు.

నిధుల్లేవ్!


ఐటీడీఏలో ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే, ట్రైకార్ చైర్మన్, గిరిజన సంఘాల నాయకులు (ఫైల్)

▸ ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై నీలినీడలు
▸ చేతులెత్తేస్తున్న ఐటీడీఏ అధికారులు
▸ నిర్వహించాల్సిందేనంటూ ఆదివాసీ సంఘాల పట్టు

బుట్టాయగూడెం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీలు జరుపుకునే ఏకైక పండుగ 'అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం'. అయితే ఈ ఏడాది కేఆర్ పురం ఐటీడీఏ కార్యాలయంలో ఈ వేడుక జరుగుతుందా? లేదా? అనే అనుమానాలు ఆదివాసీలందరిలో నెలకొన్నాయి. పండుగను ఘనంగా నిర్వహించా లని ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నేతలు పట్టుపడుతుండగా అందుకు తగ్గ నిధులు లేవంటూ అధికారులు చేతులేత్తేస్తున్నారు. ఏటా ఆగస్టు 9న ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీలు జరుపుకుంటారు. గతంలో ఈ పండుగను ఆదివాసీలంతా ఏకమై నిధులు సమీకరించి ఘనంగా చేసుకునేవారు. 2014 నుంచి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం పండుగను అధికారంగా జరపడం ప్రారంభించింది. అప్పటి నుంచి ప్రభుత్వాలే పండుగను అధికారంగా నిర్వహిస్తున్నాయి. ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది. ఇప్పటి వరకు పండుగ నిర్వహణకు ఏటా ఎంత ఖర్చు అవుతుందో గిరిజన ప్రజా ప్రతినిధులకు, నాయకులకు అధికారులు చెప్పలేదు. ఈ ఏడాదే ఖర్చుల విషయాన్ని ఎందుకు చెబుతున్నారో అర్థం కావడం లేదని వాపోతున్నారు.

రూ.ఏడు లక్షల బకాయిలు పెండింగ్

ఇప్పటికే కేఆర్‌పురం ఐటీడీఏలో పీవో కె.రాములు నాయక్ అధ్యక్షతన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏపీ ట్రైకార్ చైర్మన్, పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు ఏజెన్సీలోని అన్ని ఆదివాసీ సంఘాల నాయకులతో రెండు పర్యాయాలు సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పీవో మాట్లాడుతూ గతేడాది పండుగ నిర్వహణకు రూ.13 లక్షలు ఖర్చు అయినట్టు ప్రకటించడంతో ఆదివాసీ నేతలంతా ఆశ్చర్యపోయారు. రూ.13 లక్షలు ఖర్చు చేస్తే రూ.ఆరు లక్షలు మాత్రమే అందాయని ఇంకా రూ.ఏడు లక్షలు నిధులు రావాల్సి ఉందని, ఈ నేపథ్యలో ఈ ఏడాది పండుగను ఎలా చేయాలో అర్థం కావడం లేదని పీవో నాయకులకు చెప్పారు. అంత మొత్తంలో దేనికి ఖర్చు చేశారని సంఘాల నేతలు మొడియం శ్రీనివాసరావు, కాకి మధు, చోడెం రాజు, కుర్సం దుర్గారావు, సోదెం ముక్కయ్య మరికొందరు అధికారులను ప్రశ్నించారు. వేడుకలు నిర్వహించిన ఏడాది తర్వాత బకాయిలు రావాల్సి ఉందని చెప్పడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కాగా ఖర్చుల విషయంలో అధైర్య పడవద్దని పండుగను ఘనంగా జరపాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అధికారులకు స్పష్టం చేశారు. గతంలోను పండుగ నిర్వహణకు ఎమ్మెల్యే రూ.లక్ష, ట్రైకార్ చైర్మన్ రూ.50 వేలను ఇచ్చారు. పండుగ జరపడానికి ఇంకా నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. నిధులు విడుదలైతే ఘనంగా పండుగను చేయడానికి, నిధులు రాకుంటే ఎలా జరిపించాలన్న విషయమై అధికారులు కసరత్తులు చేస్తున్నారని తెలిసింది. ఆదివాసీ సంఘాలు, నాయకులు మాత్రం పండుగను ఘనంగా జరపాలని అవసరమైతే అన్ని శాఖల్లో టీఎస్‌పీ (ట్రైబల్ సబ్ ప్లాన్) నిధులను సమీకరించి జరపాలని పట్టుబడుతున్నారు. ఇదిలా ఉండగా గతేడాది వేడుకల నిర్వహణకు రూ. 13 లక్షల ఖర్చుపై జిల్లా అధికారులు గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు

ఏలూరు క్రైం/పెదపాడు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నియంత్రణకు, నేరాల అదుపునకు, శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా వ్యాప్తంగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వాహనాల్లో తరలిస్తున్న సరుకులు, డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్లతో తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తులపై ఆరా వంటి అంశాలను పరిశీలించారు. గంజాయి, సారా ఇతర మాదకద్రవ్యాలు అక్రమ రవాణాను నిరోధించడానికే ఈ తనిఖీలు జరిపామన్నారు. అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మారుమూల ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా ద్వారా నిఘా కొనసాగించారు. పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై వాహనాలను సీఐ సీహెచ్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తనిఖీ చేసినట్టు ఎస్.ఐ. కట్టా శారదా సతీష్ తెలిపారు. బస్సులు, లారీలు, మోటార్ సైకిళ్లను ఆపి తనిఖీలు నిర్వహించారన్నారు.


కలపర్రు టోల్‌గేట్ వద్ద తనిఖీలు



యూరియా.. మితమే..హితం!

▸ ఎక్కువ దిగుబడులు ఆశించి అధికంగా వాడకం
▸ భూసారం దెబ్బతింటుందని హెచ్చరిస్తున్న శాస్త్రవేత్తలు

చాట్రాయి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడులు ఆశించి ఎక్కువ శాతం రైతులు పరిమితికి మించి యూరియా వినియోగిస్తుండడం పట్ల శాస్త్ర వేత్తలు వ్యవసాయాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి,మొక్క జొన్న,మిర్చి, కూరగాయలు మొదలైన అన్ని పంటలకు వ్యవసాయాధికారులు సిఫార్సు చేసిన దానికంటే రెండు, మూడు రెట్లు ఎక్కువ యూరియాను వినియోగిస్తున్నారని, దీని వల్ల నేలసారం దెబ్బతింటుందని, భూమి చౌడుగా మారుతుందని తెలిసినా రైతులు పట్టించుకోవడం లేదని వ్యవసాధికారులు అంటున్నారు. సాగులో ఎక్కువగా కౌలు రైతులు ఉండడంతో అధిక దిగుబడులు కోసం యూరియా వినియోగిస్తున్నారు. యూరియా 50 కేజీల బస్తాపై కేంద్ర ప్రభుత్వం రూ.రెండు వేలు సబ్సిడీ భరించి రూ.266కే రైతులకు అందిస్తుండడం యూరియా అధిక వినియోగానికి ఒక కారణంగా చెబుతున్నారు. వరిలో కలుపుతీసిన తర్వాత 20 లేదా 40 రోజులకు యూరియా వాడాలి. కాని ఎరువులు వేసిన ప్రతిసారి యూరియా కలపడం పరిపాటి అయ్యింది. యూరియా ఎక్కువ వాడడం వల్ల మొక్కలు పచ్చగా మొత్తగా మారి చీడపీడలు సోకే అవకాశం ఎక్కువ ఉందని, దీని నివారణకు ఎక్కువ పురుగుల మందులు వాడి పెట్టుబడి ఖర్చులు పెంచుకుంటున్నారని వ్యవసాయాధికారులు అంటున్నారు.

మొక్కలకు కనీసం ఐదు సెంటీమీటర్ల దూరంలో యూరియా వేయాల్సి ఉండగా రైతులు అవగాహన లేక మొక్కల దగ్గర వేస్తున్నారు. యూరియా అధికంగా వాడడం వల్ల భూభౌతిక స్థితిలో మార్పు వచ్చి, నీటి నిల్వ సామర్థ్యం, ఎరువుల కరిగించుకుని మొక్కకు అందించే గుణం తగ్గుతుందని, పోషకాల సమతుల్యత దెబ్బతింటుందని రైతులు దిద్దుబాటు చర్యలు చేపట్టి నేలలో సేంద్రియ కర్బనం పెంచుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..



యూరియా అధిక వినియోగం వల్ల భూసారం దెబ్బతిని, మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. యూరియా ఎక్కువ వేయడం వల్ల కాండం, ఆకు మెత్తబడి ముదురు ఆకు పచ్చగా వస్తే అధిక దిగుబడి వస్తుందనేది రైతుల అపోహ మాత్రమే. ఒక సర్వే ప్రకారం తెలంగాణ కంటే ఏపీలో 40 శాతం ఎక్కువ రసాయనిక ఎరువులు వాడుతున్నారు. నానో యూరియా కూడా బాగా పని చేస్తున్నదని శాస్త్రవేత్తల పరిశోధనలో తేల్చారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట, జీవన ఎరువులు వాడడం ద్వారా 25 శాతం ఎరువులు ఆదా చేయవచ్చు. ప్రకృతి వ్యవసాయం విధానం అనుసరిస్తే వాతావరణ కాలుష్యం తగ్గడంతో పాటు ఆరోగ్యకరమైన పంటలు ఉత్పత్తి చేయవచ్చు. ఇప్పటికి ఎక్కువ మంది రైతులు డీలర్ల సలహాలు పాటిస్తూ రసాయనిక ఎరువులు పురుగుల మందులు యథేచ్ఛగా వినియోగిస్తుండడం ఆందోళనకరం. దీనిపై రైతుల్లో అవగాహన తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం.

- జి.విద్యాసాగర్, ఏడీఏ, వ్యవసాయశాఖ, నూజివీడు

రాగివైర్ల దొంగల జోరు


వేల్పుచర్లలో వ్యవసాయ బోరు వద్ద కేబుల్ కట్ చేసిన దృశ్యం

▸ పొలాల్లో సామగ్రి అపహరణ..
▸ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆగని చోరీలు.. బాధిత రైతుల ఆవేదన

ముసునూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్లకు సంబంధించిన సామగ్రిలో రాగివైర్ల చోరీలు కొనసాగుతూనే ఉన్నాయి. రాత్రి సమయాల్లో కేబుల్ వైర్, స్టార్టర్, ఫ్యూజుల్లోని రాగివైరును దుండగులు చోరీ చేస్తుండడంతో ప్రతి రైతు రూ.10వేలు నుంచి రూ.15వేలు వరకు నష్టపోతున్నాడు. తాజాగా వేల్పుచర్లలో నలుగురు రైతుల వ్యవసాయ బోర్ల నుంచి కేబుల్, ఇతర సామగ్రిలో రాగివైర్లను దొంగిలించుకుపోయారు. వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, ఈ చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధిత రైతులు తెలిపారు. నెలల వ్యవధిలోనే ముసునూరు, గోపవరం, రమణక్కపేట, కొర్లకుంట, పెద్దపాటివారిగూడెం, తాళ్లవల్లి, చెక్కపల్లి తదితర గ్రామాల్లో ఒక్కొక్క గ్రామంలో 20 నుంచి 30 బోర్ల సామగ్రి చోరీ అయ్యాయి. ఇటీవల పంటపొలాల్లో బిందు సేద్యానికి సంబంధించిన సామగ్రి సైతం చోరీకి గురవుతున్నాయి. ఒకవైపు బోర్ల సామగ్రి, మరోకవైపు డ్రిప్ పరికరాలు చోరీకి గురికావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అరకొరగా పండుతున్న పంటలతో ఇబ్బందులు పడుతుండగా, కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఈ చోరీలతో ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినా దొంగలను పట్టుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా పెట్టి ఈ చోరీలను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.


స్టార్టర్ పెట్టెలో ఫ్యూజులు పగులకొట్టిన దృశ్యం

దిక్సూచి



క్యాట్ 2025

దేశంలోని ప్రీమియర్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో అడ్మిషన్‌కు ఉద్దేశించిన 'కామన్ అడ్మిషన్ టెస్ట్'(క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఈ ఎంట్రెన్స్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎమ్) మాత్రమే కాకుండా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ-ఢిల్లీ, కోల్‌కతా), ఐఐటీల్లోని ఎంబీఏ కోర్సులు, టాప్ బిజినెస్ స్కూల్స్‌లో అడ్మిషన్ల కోసం కూడా ఉపయోగపడుతుంది. దేశ వ్యాప్తంగా 170 నగరాల్లో ఈ ఎంట్రెన్స్‌ను నిర్వహించనున్నారు. మేనేజ్‌మెంట్ కోర్సులకు ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ ఎంట్రెన్స్‌కు గత సంవత్సరం 2.93 లక్షల మంది హాజరయ్యారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ పాసైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు 45 శాతం చాలు.

పరీక్ష విధానం: గత సంవత్సరం ప్రశ్నపత్రం ఇలా ఉంది. మొత్తం మార్కులు 204. మొత్తం ప్రశ్నలు 68. ఇందులో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 48, నాన్ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 20. ప్రతీ విభాగానికి 40 నిమిషాల చొప్పున మొత్తం సమయం రెండు గంటలు ఉంటుంది. ఎంసీక్యూలకు మాత్రం నెగెటివ్ మార్కులు ఉంటాయి. నాన్ ఎంసిక్యూలకు నెగెటివ్ మార్కులు లేవు.

- వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్ - 24 ప్రశ్నలు
- డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ - 22 ప్రశ్నలు
- క్వాంటిటేటివ్ ఎబిలిటీ - 22 ప్రశ్నలు

ఈ సంవత్సరం కూడా పెద్దగా మార్పులు లేకుండా ఇలాగే ఉండే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు సిద్ధం అయితే మంచిది.

ప్రిపరేషన్ టిప్స్: భారతదేశంలో అత్యంత పోటీ ఉన్న పరీక్షల్లో 'క్యాట్' ఎంట్రెన్స్ ఒకటి. వంద పర్సంటైల్ ఉన్నవారికి కూడా అహ్మదాబాద్‌లోని ఐఐఎంలో సీటు వస్తుందన్న గ్యారంటీ లేదు. సీటు సాధించడంలో పర్సంటైల్‌తోపాటు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే పరీక్షలో మంచి మార్కులు వస్తేనే ఆ దశకు చేరుకోగలుగుతారు. అందుకోసం కొన్ని మెలకువలను పాటించాలి.

టైమ్ మేనేజ్‌మెంట్: క్యాట్ ప్రిపరేషన్‌లో ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం ఇది. ప్రతీ సెక్షన్ సమాధానాలను 40 నిమిషాల్లో పూర్తిచేయాలి. అందుకోసం ప్రిపరేషన్ సమయంలో స్పీడ్, ఆక్యురసీపై బాగా దృష్టిపెట్టాలి.

షార్ట్‌కట్ టెక్నిక్: నిర్ణీత సమయంలో సమాధానాలు గుర్తించాలంటే షార్ట్‌కట్ పద్ధతులు అనుసరించాల్సిందే. ప్రిపరేషన్ సమయంలో మెంటార్లు చెప్పే మెలకువలను బాగా గుర్తుంచుకుని పాటించాలి. ముఖ్యమైన వాటిని ఒక దగ్గర రాసుకుని తరచుగా రివ్యూ చేసుకుంటూ ఉండాలి.

గత ప్రశ్నపత్రాలు సాల్వ్ చేయడం: గత సంవత్సరాల ప్రశ్న పత్రాలను సాల్వ్ చేయడం ద్వారా డిఫికల్టీ లెవెల్ బాగా అర్థం అవుతుంది. అలాగే మాక్‌టెస్ట్‌లు రాయడం వల్ల నిర్ణీత సమయంలో సాల్వ్ చేయగలుగుతున్నారా లేదా అనేది చెక్ చేసుకోగలుగుతారు. అలాగే తమ బలాలు, బలహీనతలు తెలుస్తాయి.

- క్యాట్‌లో మరో ముఖ్యమైన విషయం ఏమంటే చాయిస్ ఆఫ్ క్వశ్చన్స్ అటెంప్ట్ చేయకముందే దానిని పూర్తి చేయగలం అనే నమ్మకం ఉన్నప్పుడు మాత్రమే దానిని సాల్వ్ చేయడానికి ప్రయత్నించాలి.
- వొకాబులరీ, రీడింగ్ స్కిల్స్ మెరుగు పరుచుకోవడానికి పుస్తకాలు, దినపత్రికలు, అందులోని ఎడిటోరియల్స్, జర్నల్స్ క్రమం తప్పకుండా చదవాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 13
పరీక్ష తేదీ: 2025 నవంబర్ 30
ఫలితాలు: 2026 జనవరి మొదటి వారం
వెబ్‌సైట్: https://iimcat.ac.in

ఐబీపీఎస్‌లో 10,277 క్లర్క్ పోస్టులు

IBPS

క్లర్క్ పోస్టుల భర్తీకి 'ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్'(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో క్లర్క్ పోస్టులను భర్తీ చేస్తారు. మొత్తం 10,277 పోస్టులు ఉన్నాయి. ఇందులో తెలంగాణలో 261, ఆంధ్రప్రదేశ్‌లో 367 ఖాళీలు ఉన్నాయి. ఆసక్తి, అర్హతలు గల అభ్యర్థులు ఐబీపీఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. కంప్యూటర్‌లో సర్టిఫికెట్/ డిప్లొమా/ డిగ్రీ సర్టిఫికెట్ లేదా స్కూలు, కాలేజీలో కంప్యూటర్ సబ్జెక్ట్ అయినా ఉండాలి. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల ద్వారా ఎంపిక జరుగుతుంది. స్థానిక భాషలో రాయడం, చదవడం వచ్చి ఉండాలి.

పరీక్ష విధానం: ప్రిలిమినరీ ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుంది. 60 నిమిషాల వ్యవధిలో వంద ప్రశ్నలకు సమాధానాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటికి వంద మార్కులు ఉంటాయి.

ఇంగ్లిషు	30 ప్రశ్నలు	30 మార్కులు	20 నిమిషాలు
న్యూమరికల్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు

ఇందులో అర్హత సాధించిన వారికి మెయిన్ పరీక్షకు పిలుస్తారు. ఇది కూడా ఆబ్జెక్టివ్ పరీక్షనే. ఇక్కడ 200 మార్కులు 155 ప్రశ్నలు ఉంటాయి. వీటికి రెండు గంటల్లో సమాధానాలు గుర్తించాలి.

జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్	40 ప్రశ్నలు	50 మార్కులు	20 నిమిసాలు
జనరల్ ఇంగ్లిష్	40 ప్రశ్నలు	40 మార్కులు	35 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	40 ప్రశ్నలు	60 మార్కులు	35 నిమిషాలు
క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్	35 ప్రశ్నలు	50 మార్కులు	30 నిమిషాలు

వయస్సు: అభ్యర్థుల వయస్సు 20 నుంచి 28 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1997 ఆగస్టు 2 నుంచి 2005 ఆగస్టు1 లోపు జన్మించి ఉండాలి(రెండు తేదీలను కలుపుకొని). ఎస్సీ/ఎస్టీలకు ఐదు సంవత్సరాలు, ఓబీసీలకు మూడు సంవత్సరాలు, దివ్యాంగులకు పది సంవత్సరాలు, వితంతువులు/ విడాకులు పొందిన మహిళలు 35 సంవత్సరాల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మాజీ మిలిటరీ ఉద్యోగులకు నిబంధనలు అనుసరించి సడలింపు ఉంటుంది.

ఖాళీలు ఉన్న బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

దరఖాస్తు ఫీజు: రూ.850/-. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ ఈఎస్ఎమ్/డీఈఎస్ఎమ్ అభ్యర్థులకు రూ.175/-.
ప్రిలిమినరీ పరీక్ష: 2025 అక్టోబర్
మెయిన్స్ పరీక్ష: 2025 నవంబర్
చివరి తేదీ: 2025 ఆగస్టు 21
వెబ్‌సైట్: ibps.in

జాబ్ కార్నర్

పదో తరగతితో ఐబీలో..

మొత్తం ఖాళీలు 4,987

కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)లో దేశవ్యాప్తంగా 4987 సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇందులో తెలంగాణకు 117 పోస్టులు, ఆంధ్రప్రదేశ్‌కు 115 పోస్టులు ఉన్నాయి.

అర్హత: పదో తరగతి పాసై ఉండాలి. దరఖాస్తు చేసిన రాష్ట్రానికి సంబంధించిన నివాస ధృవీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలి. స్థానిక భాష రాయడం, మాట్లాడడం, చదవడం వచ్చి ఉండాలి. ఇంటెలిజెన్స్ ఫీల్డ్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

వయస్సు: 2025 ఆగస్టు 17 నాటికి 18-27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు వయో పరిమితిలో మూడేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం:

టైర్-1: వంద మార్కులకు ఆబ్జెక్టివ్ టెస్ట్ ఉంటుంది. 60 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాలి. ఇందులో జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, న్యూమరికల్/అనలిటికల్, లాజికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్, ఇంగ్లిష్ నుంచి ప్రశ్నలు వస్తాయి. నెగెటివ్ మార్కింగ్ ఉంది.

టైర్-2: యాభై మార్కులకు భాషా అనువాదం డిస్క్రిప్టివ్ టెస్ట్ ఉంటుంది. వ్యవధి ఒక గంట. ఇది క్వాలిఫైయింగ్ టెస్ట్ మాత్రమే.

టైర్-3: ఇంటర్వ్యూ యాభై మార్కులకు ఉంటుంది.

చివరి తేదీ: ఆగస్టు 17
వెబ్‌సైట్: www.mha.gov.in/en

ఎయిమ్స్ & ఇతర సంస్థల్లో..

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)తోపాటు, ఇతర జాతీయ వైద్య సంస్థల్లో నర్సింగ్ పోస్టుల భర్తీ జరగనుంది. ఎయిమ్స్, జిప్మర్, ఈఎస్ఐసీల్లోని ఖాళీలను ఈ నోటిఫికేషన్ ద్వారా నింపనున్నారు.

అర్హత: బీఎస్సీ నర్సింగ్ / పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎంతోపాటు, కనీసం 50 పడకల ఆస్పత్రిలో రెండేళ్ల పని అనుభవం.

వయస్సు: అభ్యర్థుల వయస్సు 30 సంవత్సరాల లోపు ఉండాలి. రిజర్వేషన్‌లను బట్టి సడలింపు ఉంటుంది.

చివరి తేదీ: 2025 ఆగస్టు 11
పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్14న స్టేజ్-1 పరీక్ష, 2025 సెప్టెంబర్ 27 స్టేజ్-2 పరీక్ష.
వెబ్‌సైట్: www.aiimsexams.ac.in

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

నాకు గొప్ప పేరు తెచ్చిన చిత్రమిది

- సత్యదేవ్



'కింగ్‌డమ్' సినిమా మొదటి ఆట చూసినప్పటి నుంచి ప్రేక్షకులు, స్నేహితులు ఫోన్లు చేసి అభినందిస్తున్నారు. నటుడిగా నాకు గొప్ప పేరు తెచ్చిన చిత్రమిది' అని సత్యదేవ్ అన్నారు. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. ప్రేక్షకాదరణతో కొనసాగుతోన్న సందర్భంగా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన సత్యదేవ్ మీడియాతో మాట్లాడారు. 'శివ పాత్ర కోసం దర్శకుడు గౌతమ్ మొదట నా పేరే రాసుకున్నారట. కథ నచ్చి వెంటనే ఓకే చెప్పాను. యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులకు కనెక్ట్ అవ్వాలంటే దాని వెనుక బలమైన ఎమోషన్ ఉండాలని నేను నమ్ముతాను. 'కింగ్‌డమ్'లో అలాంటి ఎమోషన్ ఉంది కాబట్టే నా యాక్షన్ సీన్స్‌కి అంత మంచి స్పందన వస్తోంది. ప్రీ క్లయిమాక్స్ ఎపిసోడ్ కోసం చాలా కష్టపడ్డాం. ఇప్పుడు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూశాక..ఆ కష్టమంతా మరచిపోయాను' అని సత్యదేవ్ చెప్పారు.

వేతన పెంపు లేకుంటే షూటింగ్స్ బంద్

- ఫిల్మ్ ఫెడరేషన్ నిర్ణయం

వేతనాలు పెంచేవరకూ 24 కార్మిక సంఘాలు షూటింగ్స్‌లో పాల్గొనకూడదని టాలీవుడ్ ఫిల్మ్ ఫెడరేషన్ నిర్ణయం తీసుకుంది. ఫిల్మ్ ఛాంబర్, ఫిల్మ్ ఫెడరేషన్‌కు మధ్య జరుగుతున్న చర్చలు విఫలం కావడంతో ఫెడరేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. వేతనాల పెంపు డిమాండ్‌పై చర్చించేందుకు ఆదివారం ఫిల్మ్ ఫెడరేషన్ సర్వసభ్యసమావేశం నిర్వహించింది. ఇందులో తీసుకున్న కీలక నిర్ణయాలను ఫెడరేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. నేటి (ఆగస్టు 04) నుంచి 30 శాతం వేతనాలు పెంచుతామని హామీ పత్రం ఇచ్చిన నిర్మాతల షూటింగ్స్‌కు మాత్రమే వెళ్లాలి, వేతనాల పెంపు అమలు చేయని సినిమాల షూటింగ్స్‌కు వెళ్లకూడదని తీర్మానించింది. పెంచిన వేతనాలను ఏ రోజుకారోజే చెల్లించే విధానం అమలు చేయాలనీ, ఫెడరేషన్ ద్వారా యూనియన్లకు తెలియజేసిన తర్వాతనే షూటింగ్స్‌లో పాల్గొనాలని 24 కార్మిక సంఘాలకు తెలిపింది.

కనీస వేతనాల కంటే ఎక్కువే ఇస్తున్నాం

ఫెడరేషన్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఫిల్మ్ ఛాంబర్ స్పందించింది. 'ఫెడరేషన్ పక్షపాతంతో 30 శాతం వేతనాల పెంపును డిమాండ్ చేస్తోంది. ప్రస్తుత చట్టాల ప్రకారం నైపుణ్యం ఉన్నవారికి, లేనివారికి కనీస వేతనాల కంటే ఎక్కువే ఇస్తున్నాం. ఈ సమ్మె నిర్ణయం నిర్మాణంలో ఉన్న చిత్రాలకు భారీ నష్టాన్ని కలిగిస్తుంది. ఫెడరేషన్‌తో కలిసి పనిచేస్తున్న మనం ఈ నిర్ణయాన్ని ఖండిస్తున్నాం. ఈ సమస్యకు స్థిరమైన పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో చర్చిస్తాం. అంతవరకూ నిర్మాతలు ఎలాంటి స్వతంత్ర చర్యలు గానీ సంఘాలతో ప్రత్యేక ఒప్పందాలు గానీ చేసుకోకుండా ఛాంబర్ మార్గదర్శకాలను అనుసరించాలని కోరుతున్నాం. శాశ్వత పరిష్కారం కోసం, మెరుగైన భవిష్యత్తు కోసం ఐక్యతతో ఉండాలి. మరిన్ని వివరాలు త్వరలోనే ప్రకటిస్తాం' అని ఫిల్మ్ ఛాంబర్ పేర్కొంది.

ఈ సినిమాను పవన్ చూడాలి

- నిర్మాత అల్లు అరవింద్



'మా కుటుంబంలో, సన్నిహితులు, పరిచయం ఉన్నవారందరిలో సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్‌కు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. ఆయన సనాతన ధర్మం గురించి ప్రసంగిస్తే అందరూ ముగ్ధులవుతారు. 'మహావతార్ నరసింహ' సినిమాని ఆయన చూడాలని, దాని గురించి మాట్లాడాలని కోరుకుంటున్నా' అని అన్నారు నిర్మాత అల్లు అరవింద్. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించిన 'మహావతార్ నరసింహ' సినిమా ఇటీవలె విడుదలై మంచి ప్రేక్షకాదరణతో థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ 'భారత దేశమంతటా ప్రేక్షకులు ఈ సినిమాకు జేజేలు పలుకుతున్నారు. హైదరాబాద్‌లోని ఏఎంబీలో 200 మంది స్వాములు ఈ చిత్రాన్ని చూడటం నాకు చాలా ఆనందంగా అనిపించింది' అని అన్నారు.

నవ్వుల పండగ



కన్నడనాట ఇటీవలె విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న చిత్రం 'సు ఫ్రమ్ సో'. తాజాగా ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. ఈనెల 8న మైత్రీ మూవీమేకర్స్ విడుదల చేస్తోంది. జేపీ తుమినాడ్ కథానాయకుడిగా నటించి దర్శకత్వం వహించారు. షనీల్ గౌతమ్, సంధ్య అరకెరె ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్.బి.శెట్టి, శశిధర్ శెట్టి బరోడా, రవిరాయ్ కలస నిర్మించారు. ఆసక్తికరమైన కథ, కథనంతో నిండిన ఈ చిత్రం ప్రేక్షకులకు నవ్వుల పండగను అందిస్తుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేశారు.

యువతా నీ గమ్యం ఎటు వైపు?



హీరో కృష్ణసాయి కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'డేంజర్'. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 'ఓ యువతా నీ గమ్యం ఎటు వైపు?' అంటూ సందేశాత్మకంగా సాగే గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు మా బాధ్యతగా డ్రగ్స్‌పై ఓ చైతన్యవంతమైన గీతాన్ని రూపొందించాం. మా ప్రయత్నాన్ని గవర్నర్లు, పోలీస్ అధికారులు ప్రశంసించారు. ఈ సినిమా ప్రజలను ప్రభావితం చేస్తుంది. యువతలో మార్పు తీసుకొస్తుందనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

కొరియోగ్రాఫర్ కృష్ణపై పోక్సో కేసు

టాలీవుడ్‌లో మరో లైంగిక ఆరోపణల కేసు నమోదైంది. మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడన్న ఆరోపణలపై కొరియోగ్రాఫర్ కృష్ణ మాస్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం ఓ పెళ్లయిన మహిళతో కృష్ణ మాస్టర్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనీ, ఈ క్రమంలో ఆమె కూతురిపై కూడా కృష్ణ లైంగిక దాడి చేశాడంటూ సదరు మహిళ జూలై 9న ఫిర్యాదు చేశారు. దీంతో గచ్చిబౌలి పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరు పరచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

ముగింపును మార్చడం నన్ను బాధించింది

- ధనుష్



ధనుష్ కథానాయకుడిగా ఆనంద్.ఎల్.రాయ్ తెరకెక్కించిన 'రాంఝనా' 2013లో విడుదలై సంచలన విజయం సాధించింది. ఇందులోని పాటలు, భావోద్వేగాలు అందరినీ ఆకట్టుకోగా, ముగింపు చాలా మందిని కంటతడి పెట్టించింది. ఇటీవలె ఈ సినిమాను తమిళనాడులో రీ రిలీజ్ చేశారు. అయితే, ఏఐ సాయంతో ఇందులోని క్లైమాక్స్‌ను నిర్మాతలు మార్చారు. 2013లో విడుదలైన ఒరిజినల్ వెర్షన్ ముగింపులో తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరిన హీరో చికిత్స తీసుకుంటూ చనిపోతాడు. అయితే, కొత్తగా విడుదల చేసిన వెర్షన్‌లో హీరో కోలుకున్నట్టు చూపించారు. దీనిపై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వెర్షన్ చూసిన ఫ్యాన్స్ కొందరు ఆనందం వ్యక్తం చేస్తుండగా, దీనిపై ధనుష్, ఆనంద్.ఎల్.రాయ్‌తో పాటు మరికొందరు అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఈ సినిమా ముగింపును మార్చడం నన్ను కలచివేసింది. క్లైమాక్స్ మార్పు, సినిమా ఆత్మను దెబ్బతీసింది. నేను వద్దంటున్నా ఈ రీ రిలీజ్‌కు ముందుకెళ్లారు. 12 ఏళ్ల క్రితం నేను చేసిన సినిమా ఇది కాదు. ఇలా ఏఐతో సినిమా కంటెంట్‌ను మార్చడం కళతో పాటు కళాకారులకు తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి పనులు కథ చెప్పే విధానానికీ, సినిమా వారసత్వానికీ ప్రమాదకరం. భవిష్యత్తులో ఇలాంటివి మరోసారి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆశిస్తున్నాను' అని ధనుష్ ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇలా కృత్రిమ మేధ సాయంతో సినిమా కంటెంట్‌ను మార్చే ప్రయత్నం అర్థరహితమైంది. 12 ఏళ్లుగా ఈ సినిమాను తమ హృదయాల్లో పదిలంగా దాచుకున్న అభిమానుల నమ్మకాన్ని వమ్ము చేయడమే' అని ఆనంద్.ఎల్.రాయ్ విమర్శించారు.

అలరించే కామెడీ థ్రిల్లర్



ప్రవీణ్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్ జే శివ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటించారు. లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో హీరో సుధీర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 'ప్రవీణ్ ఈ సినిమాతో హీరోగా మారుతున్నందుకు సంతోషంగా ఉంది. 'బకాసురు రెస్టారెంట్' ఘన విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. ప్రవీణ్ మాట్లాడుతూ 'నా మీద నమ్మకంతో హీరోగా పెట్టి సినిమా తీసిన మా దర్శక నిర్మాతలకు నా ధన్యవాదాలు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం ఇది' అని చెప్పారు. దర్శకుడు ఎస్‌జే శివ మాట్లాడుతూ 'ఈ సినిమా ఆద్యంతం ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది' అని అన్నారు.





ఏలూరు జిల్లాలో ఎంపికైన క్రీడాకారులు

'పశ్చిమ' జిల్లాలో ఎంపికైన క్రీడాకారులు

అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఏలూరు రూరల్/తణుకు రూరల్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ జిల్లాలో అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారులను ఆదివారం ఎంపిక చేశారు. ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా జట్ల ఎంపిక పోటీలు అల్లూరి సీతారామరాజు స్టేడియంలోనూ, పశ్చిమ గోదావరి జిల్లాలో జిల్లా అథ్లెటిక్స్ పోటీలు తణుకులోని ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరిగాయి. ఆయా జిల్లాలో అండర్-14, 16, 18, 20 విభాగాలలో బాల బాలికలకు పోటీలు నిర్వహించారు. రన్స్ త్రో, జంప్స్ పలు ఈవెంట్లలో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేశారు. ఈ క్రీడాకారులు ఈనెల 9,10,11 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాల తరఫున ప్రాతిథ్యం వహిస్తారని ఏలూరు జిల్లా కార్యదర్శి దేవరపల్లిప్రసాద్ తెలిపారు. ఏలూరులో పోటీలను ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షులు గుళ్లా ప్రసాదరావు, జిల్లా వీరభద్రరావు, మరడాని అచ్యుతరావు, ఎ.శ్రీనివాసరావు ప్రారంభించారు, దేవరపల్లి ప్రసాద్ పర్యవేక్షించారు. తణుకులో పోటీలను ప్రాంతీయ వ్యాయామ విద్యా శాఖాధికారి బి. జాన్సన్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మానేపల్లి శ్రీనివాస్, కార్యదర్శి సంకు సూర్యనారాయణ ప్రారంభించారు. కొమ్మిశెట్టి రాంబాబు, చింతకాయల సత్యనారాయణ, కేవీఆర్ సుబ్బారావు, ఆర్.నాగేశ్వరరావు, కె. వెంకన్నబాబు, దిలీప్, కె.సుజాత, విజయదుర్గ, పాల్గొన్నారు.





ఏలూరులో జరిగిన పోటీల్లో పాల్గొన్న వెయిట్ లిఫ్టర్లు

హోరాహోరీగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఏలూరు రూరల్, ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి) : వెస్ట్‌గోదావరి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరు ఇండోర్ స్టేడియంలోని వెయిట్ లిఫ్టింగ్ హాల్లో అస్మిత కేలో ఇండియా మహిళా లీగ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఆదివారం పోటీలను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించి మాట్లాడారు. వెయిట్ లిఫ్టర్లు జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ రాష్ట్రఖ్యాతిని పెంచుతున్నారని కొనియాడారు. ప్రభుత్వం క్రీడాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఉదయం జరిగిన 44, 48, 80, 86 కిలోల శరీర బరువు కేటగిరీలలో జిల్లాలకు చెందిన మహిళా లిఫ్టర్లు స్నాచ్, క్లీన్‌జర్క్ బరువులెత్తి పోటీపడ్డారు. వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దిన్నాబాబు, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి బడేటి వెంకట్రామయ్య, తదితరులు పర్యవేక్షించారు.

విజేతల వివరాలు ఇలా..

44 కేజీల విభాగంలో మొదటి స్థానంలో ఎం.పావని, రెండో స్థానంలో ఎం.దీక్షిత, మూడో స్థానంలో పి.ఇందు; 48 కేజీల విభాగంలో మొదటి స్థానంలో ఎస్‌డీ మదీన, రెండో స్థానంలో పీజీ పద్మావతి, మూడో స్థానంలో ఎ.రిషిత ; 53 కేజీల విభాగంలో ఎస్.అనిత, ఎ.హర్షిక, ఎం.అనూష ; 58 కేజీల విభాగంలో కె.కీర్తన, జి.పవిత్ర, కె.భార్గవి ; 63 కేజీల విభాగంలో సీహెచ్‌ఎస్‌ఎస్‌జీ హారికరెడ్డి, జడ్ భవాని, కె.హర్షిత; 69 కేజీల విభాగంలో కె.లావణ్య, కె.శ్రీవెన్నెల, జి.షారోన్ ; 77 కేజీల విభాగంలో ఎస్‌వీఎల్ హారిక, కె. మేఘన, ఆర్.అను; 77 కేజీల విభాగంలో వి.శశికళ, ఎస్‌కే ఆశాజ్యోతి, ఆర్. రాజీ; 86 కేజీల విభాగంలో కేఎస్ఆర్ లక్ష్మి,పి.ప్రవీణ, వి.ఈశ్వరిసాయి నిలిచారు. బెస్ట్ లిఫ్టర్‌గా టి.లావణ్య, స్ట్రాంగ్ లిఫ్టర్‌గా కేఎస్ఆర్ లక్ష్మి నిలిచారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పంకజ్‌కుమార్

'సైన్స్‌లో విద్యార్థుల సామర్థ్యం పెంచాలి'

ఆగిరిపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జీవశాస్త్రంలో విద్యార్థుల సామర్థ్యం పెంచాలని ఏలూరు సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. పంకజ్ కుమార్ అన్నారు. తోటపల్లిలోని హీల్ పాఠశాలలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ జీవశాస్త్ర ఉపాధ్యాయినులకు ఆదివారం రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణలో 15 జిల్లాల నుంచి 170 మంది ఉపాధ్యాయినిలు పాల్గొనగా, 8 మంది రిసోర్స్ పర్సన్స్ జీవశాస్త్రంపై అవగాహన కల్పించారు. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు జీవశాస్త్రంపై పట్టు సాధించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఐదు రోజులపాటు సాగుతుందని తెలిపారు. జీవశాస్త్రంలో విద్యార్థులు 50కి 50 మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ల్యాబ్స్ మెరుగుపరిచి, ప్రయోగాలు నిర్వహించాలన్నారు. ఏఎంవో రెడ్డి రామారావు, ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.నవీన, ఆగిరిపల్లి ఎంఈవో-2 కొవ్వలి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 నాణెం మింగిన బాలిక

» తొలగించిన ఆయుష్ ఆసుపత్రి వైద్యులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఆటలాడుతూ ప్రమాదవశాత్తు ఐదు రూపాయల నాణెం మింగిన ఎనిమిదేళ్ల బాలికకు అత్యవసర ఎండోస్కోపి చికిత్స ద్వారా ఏలూరు ఆయుష్ ఆసుపత్రి వైద్యులు ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఆసుపత్రి మేనేజర్ కాశీనాథ్‌జాస్తి ఆదివారం స్థానిక మీడియాకు తెలిపారు. నాణెం మింగిన బాలిక తిన్నది మింగలేక, ఊపిరాడక తీవ్రంగా విలవిల్లాడుతున్న స్థితిలో ఆసుపత్రికి కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు, థెరప్యూటిక్ ఎండోస్కోపిస్టు డాక్టర్ వేమూరి ప్రసన్నకుమార్ నేతృత్వంలోని వైద్యబృందం బాలిక గొంతులో చిక్కుకున్న నాణెంను ఎండోస్కోపి చికిత్సతో విజయవంతంగా తొలగించారు. డాక్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పిల్లల్లో వస్తువులను నమలడం, మింగటం కొందరికి అలవాటుగా ఉంటుందని, తల్లిదండ్రులు ఇటువంటి పిల్లలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య చికిత్స ప్రక్రియలో ఆసుపత్రి అనస్థిటిస్టు డాక్టర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



చికిత్స అనంతరం బాలికతో ఆయుష్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది. (ఇన్‌సెట్‌లో) ఐదు రూపాయల నాణెం

అమ్మా.. గుబ్బల మంగమ్మ

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద భక్తులు

బుట్టాయగూడెం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీ అడవి బిడ్డల వనదేవత గుబ్బల మంగమ్మను దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు క్యూలైన్లో నిలబడి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల అమ్మవారి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఏజెన్సీలో పొడి వాతావరణం ఉండడంతో ఆదివారం వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తుల సౌకర్యం కోసం కమిటీవారు అన్ని ఏర్పాట్లు చేశారు.

గోవిందా.. గోవింద.. శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ



ఆలయ ప్రాంగణంలో కొబ్బరి కాయలు కొడుతున్న భక్తులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవురోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. దేవస్థానంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో నిండింది. 12వేల మందికి పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది. దర్శనానంతరం ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

22న సామూహిక వరలక్ష్మీవ్రతాలు

శ్రీవారి క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీవ్రతాలు ఈనెల 22న నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ వ్రతాలు ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభమవుతాయని వివరించారు. ఈ వ్రతాలను స్థానిక అనివేటి మండప ఆవరణలో జరుపుతామని మహిళలు తమ పేర్లను ఆలయ కార్యాలయంలోనూ, సమాచార కేంద్రాల వద్ద నమోదు చేయించుకోవాలని ఈవో కోరారు.

బాకీ కడతావా.. లేదా..?

కేంద్ర ప్రభుత్వం లోన్ యాప్‌లను నిషేధించినా పాత బాకీదారులను లోన్‌యాప్ వసూలు రాయుళ్లు బెదిరింపులకు గురి చేస్తున్నారు. లోన్ యాప్‌లో లోన్ తీసుకుని అందుకు రెట్టింపు కట్టినా ఇంకా బాకీ ఉందంటూ వేధించడం పరిపాటిగా మారింది.

» లోన్ యాప్ ఏజెంట్ల ఫోన్ » బాకీ చెల్లించాలని ఒత్తిడి
» సంబంధం లేని వారిపైనా జులుం
» బాధితుల గగ్గోలు



పాలకొల్లు టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): లోన్ యాప్ ద్వారా రుణాలు తీసుకున్న వారిని వారు చెప్పినంత డబ్బులు చెల్లించకుంటే లోన్ తీసుకున్న వ్యక్తి బంధువులు, మిత్రులకు కూడా రకరకాల బెదిరింపులు, మెయిల్స్ వస్తున్నాయి. దీంతో ఎక్కడ పరువుపోతుందోనని కొందరు వారు అడిగినంత సొమ్మును చెల్లిస్తున్నారు. మరి కొందరు వారి బెదిరింపులకు ఆత్మహత్యలకు పాల్పడడం మనం చూస్తూనే ఉన్నాం. కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆర్‌బీఐ కూడా వేలాది లోన్ యాప్‌లను నిషేధించింది. అయినా గతంలో లోన్ యాప్ లో తీసుకున్న రుణాలకు వడ్డీ, చక్రవడ్డీతో సహా చెల్లించాలంటూ వేధింపులకు పాల్పడుతున్నారు. లోన్ తీసుకున్నప్పుడు సదరు వ్యక్తి వారికి సంబంధించిన మిత్రులు, కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లు ఒకరిద్దరివి తీసుకుని వారిని కూడా లోన్ చెల్లించాలని తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారు. అసలు సంబంధం లేని వ్యక్తి తమకు ఫోన్లు చేసి వేధించడం ఏమిటని కొందరు, ఎంతో కొంత కడతామని మరి కొందరు (తమకు సంబంధం లేకున్నా) వసూళ్ల రాయుళ్ళ వేధింపులతో కొంత సొమ్మును వారికి పంపిన లింకులకు జమ చేసినా, వారి వేధింపులు ఆగడం లేదు. దీనిపై పోలీసు అధికారులు చర్యలు తీసుకుని లోన్ యాప్‌దారుల బెదిరింపుల నుంచి కాపాడాలని వేడుకుంటున్నారు.

రికవరీ ఏజెంట్ల నుంచి రక్షించాలి



నాకు లోన్ యాప్‌తో సంబంధమే లేదు. అయినా నువ్వు లోన్ యాప్‌లో లోను తీసుకున్న వ్యక్తికి హామీ ఉన్నావంటూ నాకు రోజుకు 20, 30 సార్లు రకరకాల ఫోన్ నంబర్లతో ఫోన్ చేసి వేధింపులకు గురిచేస్తున్నారు. లోన్ తీసుకున్న వ్యక్తి నా నంబరు ఇవ్వడంతో నన్ను వేధించడం ఎంత వరకు సమంజసం. నాలాంటి చదువులేని వారిని పోలీసులే రికవరీ ఏజెంట్ల బారి నుంచి రక్షించాలి.

- శిడగం సతీష్, పాలకొల్లు

బెదిరింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలి



ఎవరైనా ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడితే పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలి. లోన్ యాప్‌దారులు వారికి ఉన్న బాకీదారుల రికవరీని కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలి. వేధింపులు ఎక్కువైతే యాప్‌దారుల ఫోన్ నంబర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టండి. యాప్ లోన్ తీసుకున్న వారిని కానీ, సంబంధం లేని వ్యక్తులు కానీ వేధిస్తే పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయండి. వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- కోలా రజనీ కుమార్, పట్టణ సీఐ, పాలకొల్లు

రేపటి నుంచి 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం

» ఏపీజీఈఏ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం

ఏలూరుసిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 5వ తేదీ నుంచి మూడు నెలల పాటు 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే విన్నూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టను న్నామని ఏపీజీఈఏ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్‌వీ రామకృష్ణారావు, కార్యదర్శి ఏడీఎస్ ఆర్ఎం బంగారయ్య ఆదివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు (ఏపీజీఈఏ) కేఆర్ సూర్య నారా యణ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు సుమారుగా రూ.23వేల కోట్లు రావాల్సిన డీఏ, పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు, సీపీఎస్ ఉద్యోగుల సమస్యలు వంటి 27 సమ స్యలు పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగలు సంఘం సూచిస్తున్న మార్గాలను ఉద్యోగులతో చర్చించటానికి, అభిప్రాయాల సేక రణ కోసం ఇప్పటికే విడుదలైన 20 నిమిషాల నిడివి కలిగిన వీడియో టీజర్‌పై ఉద్యోగుల నుంచి విశేష స్పందన వచ్చిం దన్నారు. ఈనెల ఐదు నుంచి వారానికి ఒక వీడియో విడుదల చేస్తామని వారు తెలిపారు.

ఉత్సాహంగా నర్తనబాల అవార్డుల ప్రదానం



నర్తనబాల అవార్డు అందుకున్న చిన్నారులు

ఏలూరు రూరల్, ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): అభినయ నృత్యభారతి ఆధ్వర్యంలో వైఎంహెచ్ఏ హాలు ప్రాంగణంలో పదో జాతీయస్థాయి నర్తనబాల అవార్డుల ప్రదాన మహోత్సవం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. 68మంది చిన్నారి నర్తకులు వారి ప్రతిభాపాటవాలు ప్రదర్శించి అవార్డులు అందుకున్నారు. అనంతరం నాట్య రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ పదో తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన నర్తన చిన్నారులకు అభినయ విద్యాపురస్కారాలు అందించారు. కార్యక్రమానికి సంస్థ గౌరవ అధ్యక్షులు, అంబికా సంస్థల యజమాని అంబికా కృష్ణ, త్రినాథ్ సంస్థల అధినేత శలా రాజాబాబు, సర్.సి.ఆర్.ఆర్. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ముక్కామల కృష్ణారావు, తదితరులు ముఖ్య అతిథిలుగా హాజరై అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దువ్వి రామారావు, నాట్యచార్య డి.హేమసుందర్ పర్యవేక్షించారు.

క్రైం సమాచారం

భార్యపై హత్యాయత్నం చేసిన భర్తకు ఎనిమిదేళ్ల జైలు, జరిమానా

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): భార్యపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన భర్తకు ఎనిమిదేళ్ల జైలు, రూ.5 వేల జరిమానా విధిస్తూ తాడేపల్లిగూడెం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె. మాధవి తీర్పు చెప్పారు. తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంటకు చెందిన నక్క ప్రమీలకు ఏలూరు జిల్లా కలిదిండి మండలం సంతోషపురానికి చెందిన నక్క శ్యాంబాబుకు 2019లో వివాహమైంది. కొద్దిరోజులు తరువాత మద్యానికి బానిసై భార్యను తరచూ కొడుతూ హింసించేవాడు. హింస భరించలేక ఆమె పుట్టింటికి వచ్చేయగా 2021లో ఆగస్టులో నిద్రిస్తున్న ఆమెను కత్తితో బలంగా దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు భర్త శ్యాంబాబు, అత్త మామలపై ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తులో భర్త శ్యాంబాబుపై నేరం రుజువు కావడంతో ఎనిమిదేళ్ల జైలు, రూ.5వేల నగదు జరిమానా విధించారు. అత్త మామలపై నేరం రుజువు కాకపోవడంతో వారిపై కేసు కొట్టివేశారు. ఈ కేసు దర్యాప్తులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుసులూరి శివరామకృష్ణ, సీఐ రమేష్, ఎస్ఐ జేవీఎన్ ప్రసాద్ దర్యాప్తుకు సహకరించారు.

లాకుల్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పాలకొల్లు టౌన్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి):స్థానిక లాకుల వద్ద నరసాపురం మెయిన్ కెనాల్‌లో ఆదివారం గుర్తు తెలియన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు, పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివి.. లాకుల వద్ద ఓ పురుషుడి మృత దేహం ఉన్నట్టు గుర్తించిన ఇరిగేషన్ అధికారులు పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహం కుళ్లి పోవడంతో గుర్తు పట్టలేని విధంగా ఉందని, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

దంపతులపై దాడి చేసిన ముగ్గురిపై కేసు

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఓ దంపతులను తిట్టి, కొట్టి గాయపరిచిన ముగ్గురు వ్యక్తులపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ టి.బాబూరావు తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం అక్కంపేట గ్రామానికి చెందిన పింగుల హరీష్ బుట్టాయగూడెం మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అతడు తన భార్య, పిల్లలతో అక్కంపేటలో నివాసం ఉంటున్నారు. ఈనెల ఒకటో తేదీన అతడు తన భార్యతో గొడవ పడుతుండగా అదే గ్రామానికి చెందిన అతడి బంధువులు పింగుల శ్రీనివాసరావు, పింగుల జయరాజు కర్రలతో కొట్టారు. అడ్డుపడిన హరీష్ భార్యను పింగుల శ్రీనివాసరావు భార్య ఝాన్సీరాణి తిడుతూ నీ వల్లే ఈ గొడవ జరిగిందని చచ్చిపోవాలని తిట్టగా హరీష్ భార్య మనస్తాపంతో చీమల మందు తాగేసింది. వీరిద్దరినీ బంధువులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

మద్యం షాపు వద్ద ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

తణుకు, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి):తణుకు జాతీయ రహదారికి ఆనుకుని వున్న మద్యం షాపు వద్ద ఆదివారం బీరు సీసాలతో జరిగిన ఘర్షణలో పలువురుకి గాయాలయ్యాయి. తణుకు పాతూరుకు చెందిన ననమండ్ర రాజేష్, ముప్పిడి సత్యనారాయణ, చదలవాడ కిరణ్ మద్యం తాగుతుండగా రాజేష్ బీరు సీసా పగులుగొట్టి సత్యనారాయణ, కిరణ్‌లపై దాడి చేశాడు. దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలవ్వడంతో వైద్యం కోసం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



బెల్లపు ఊట డ్రమ్ము వద్ద పోలీసులు

పోలవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నాటు సారా స్థావరాలపై జరిపిన దాడుల్లో 600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ వీరబ్రహ్మం, పోలీస్ ఎస్ఐ పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. పోలవరం మండలం ఎల్లండిపేట పరిసర ప్రాంతాల్లో పోలవరం పోలీస్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్లండిపేట, కుంకాల శివారు వెదుళ్లగండి ప్రాంతాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడి చేశారు. నిల్వ ఉంచిన బెల్లపు ఊట ధ్వంసం చేసి అనుమానితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆరేళ్ల క్రితం మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు

» మరో వివాహం చేసుకుని హైదరాబాద్‌లో నివాసం

మొగల్తూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఓ రోడ్డు ప్రమాదం కేసులో ఉన్న ఒక ముద్దాయి ఆరేళ్ల క్రితం అదృశ్యమైన నిందితుడి ఫైనాన్ని మొగల్తూరు పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. వివరాలివి.. మండలంలోని పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధి ముచ్చర్లవారి మెరకకు చెందిన అలమోలు రామాంజనేయులు ఆరేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణం కావడంతో ఆ కేసులో ముద్దాయిగా ఉన్నాడు. అ సమయంలో పోలీసులకు అతడి ఆచూకీ లభించకుండా పరారయ్యాడు. అతడి తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు 2019లో అప్పటి ఏఎస్ఐ రమణ మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. నిందితుడు పరారై హైదరాబాద్‌లో ఉంటూ పేరుపాలెంలో వున్న తన భార్యను వదిలేసి అక్కడ మరో వివాహం చేసుకుని జీవిస్తున్నాడు. ఈ కేసులో నిందితుడి వివరాలు తెలుసుకున్న మొగల్తూరు పోలీసులు హైదరాబాద్‌లో అతడి వివరాలు సేకరించారు. మొగల్తూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కె.నాగేంద్ర, హోంగార్డు శ్రీనివాస్ నిందితుడు రామాంజనేయులు ఆచూకీ సేకరించారు. అతడిపై వారెంట్ ఉండడంతో అరెస్ట్ చేసి నరసాపురం కోర్టులో హాజరుపర్చారు. నరసాపురం సబ్ జైల్‌లో రిమాండ్‌లో ఉన్నట్టు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు ఆదివారం తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

పెంటపాడు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : మండంలోని కె.పెంటపాడు ఖాళీ స్థలంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్ఐ స్వామి తెలిపారు. వారి వద్ద నుంచి రూ 2,600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

పీ4 సర్వేపై 26 మంది వార్డు సెక్రటరీలకు సంజాయిషీ నోటీసులు

భీమవరంటౌన్,ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4 సర్వేలో ఇచ్చిన లక్ష్యాలను చేరుకోలేకపోయిన వార్డు అడ్మిన్, ఎడ్యుకేషన్ సెక్రటరీలకు మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. మొత్తం 26 మందికి నోటీసులు పంపించారు. ఎందుకు తక్కువ శాతం నమోదు చేశారో 48 గంటల్లో వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. సంజాయిషీ సక్రమంగా లేకపోతే తదుపరిచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



శృంగవృక్షంలో డ్వాక్రా సభ్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

'అభివృద్ధే మా ప్రభుత్వ ధ్యేయం'

పాలకోడేరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే మా ప్రభుత్వ ధ్యేయమని, ఉండి నియోజకవర్గంలో ప్రభుత్వ నిధులు ఉన్నా లేకపోయినా దాతల సహకారంతో అభివృద్ధిపరచడమే తన ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. ఆదివారం శృంగవృక్షం గ్రామంలోని ఐదు ఎకరాల్లో ఉన్న ఏఎంసీ కేంద్రాన్ని, గ్రామంలో అసంపూర్తిగా నిలిచిన డ్వాక్రా భవనాన్ని, గ్రామంలో పేరుకుపోయిన ఆక్రమణలను పరిశీలించి మాట్లాడారు. అసంపూర్తిగా నిలిచిన డ్వాక్రా భవనాన్ని అభివృద్ధిపరిచేందుకు రూ. 15 లక్షలు అవసరం ఉందన్నారు. తన వంతుగా కొంత ఆర్థిక సహాయాన్ని అందిస్తానని, మిగిలిన మొత్తాన్ని దాతల సహకారంతో పనులు పూర్తి చేస్తామన్నారు. దీనిలోభాగంగా సోమవారం నుంచే ఆ పనులను ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామంలో ఉన్న ఏఎంసీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ ఉన్న స్థలం ఉపయోగించుకునేలా పరిష్కారాన్ని చూస్తామన్నారు. కార్యక్రమంలో పంతమని నాగరాజు, గ్రామ సర్పంచ్ జంగం సూరిబాబు, టీడీపీ నాయకులు కలిదిండి కృష్ణంరాజు, కొత్తపల్లి సూర్యనారాయణరాజు, ఎంపీటీసీ సత్యకృష్ణ, ప్రభుదాసు, నడిపూడి అప్పారావు, డ్వాకా ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌గా టి.గుంటపాలెం యువకుడి ఎంపిక



కాలా నాగేంద్ర

పాలకోడేరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరు గ్రామ శివారు తుమ్మలగుంటపాలెంకు చెందిన కాలా నాగేంద్ర ఇటీవల విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన ఇతడు పదో తరగతిలో పాఠశాల ప్రథమ స్థానం సాధించి, ఆపై పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ చదివి ఎస్ఐ జాబ్ లక్ష్యంగా సాధన చేసినప్పటికీ త్రుటిలో ఎస్ఐ జాబ్ చేజారిపోయింది. తండ్రి ఆరోగ్యం బాగోకపోవడంతో డబ్బుల కోసం జుమాటో, రాపిడో వంటివి చేసుకుంటూ దాతల నుంచి సాయం తీసుకుంటూ సాధన కొనసాగించి ఉద్యోగం సాధించాడు. ఈమేరకు గ్రామస్థులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

సర్వం సిద్ధం !

» ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
» నేటి అర్ధరాత్రి నుంచి అభ్యర్థులకు ఈవెంట్లు ప్రారంభం
» సిద్ధమైన కాకినాడ జిల్లా క్రీడామైదానం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ఈనెల 4వ తేదీ అర్ధరాత్రి నుంచి 20వ తేదీ వరకు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి ఆగస్టు 5వ తేదీన ర్యాలీ ఉంటుంది. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు 12 జిల్లాల నుంచి అభ్యర్థులు ఈ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొననున్నారు. ఇప్పటికే ఆర్మీ ఎంపిక పరీక్ష రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఇక్కడ దేహదారుఢ్య పరీక్ష, 1.6 కేఎం రన్, మెడికల్ అండ్ ఫిట్‌నెస్ టెస్టులు, లాంగ్‌జంప్, పుల్ అప్స్, నైన్ ఫీట్ డిచ్ అండ్ జిగ్‌జాగ్ ఇలా ఎంపిక ప్రక్రియకు సంబంధించిన అనేక రకాల ఈవెంట్లు జరగనున్నాయి. రోజుకు 600 నుంచి 800మంది ఈ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొంటారు. అభ్యర్థులకు ముందుగా నెంబర్లు కేటాయించి, వందమంది చొప్పున 1.6 కేఎం రన్నింగ్ పరీక్ష, అనంతరం మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు. 20 రోజులపాటు జరిగే ఈ రిక్రూట్‌మెంట్‌లో 15వేలమంది పాల్గొనే అవకాశం ఉంది. ఆర్మీ అభ్యర్థులకు స్పోర్ట్స్ అథారిటీ ఆవరణలోనే వసతి కల్పించనున్నారు. తొలిరోజు 5వ తేదీ అంటే 4వతేదీ అర్ధరాత్రి నుంచి ప్రారంభయ్యే ర్యాలీలో 600మంది పాల్గొననున్నారు. దీనిలో పశ్చిమ గోదావరి జిల్లాకు సం బంధించి ర్యాలీలో పాల్గొంటారు. 20వ తేదీన రెస్ట్‌డేతో మొత్తం ఎంపిక ప్రక్రియ పూర్తవుతుంది.

నేడు వైఎంహెచ్ఏ హాల్లో మట్టిమనిషి నాటకం

ఏలూరు రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): 50 మంది నటీనటులు, సాంకేతిక నిపుణుల బృందంచే మిత్రా క్రియేషన్స్ హైద్రాబాద్ ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం కళా తోరణం, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఏలూరు వైఎంహెచ్ఏ హాల్లో మట్టి మనిషి నాటకం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి, నవలాధారంగా మట్టి మనిషి నాటకం రూపొందించారు. నాటక రచన వల్లూరు శివప్రసాద్, ఎస్ఎం బాషా, దర్శకత్వం పర్యవేక్షణలో నాటకం ప్రదర్శించారు.

పోలవరంలో భారీ వర్షం



పోలవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షం ప్రభావానికి పోలవరం మెయిన్ రోడ్డు, బెస్తవీధి, కమ్మరగూడెం, కొత్తపేట, బాపూజీ కాలనీ, పట్టిసీమ వీరభద్రపురం ప్రాంతాల్లో పల్లపు వీధులు జలమయమయ్యాయి. డ్రైనేజీ సరిగా లేకపోవడంతో వీధుల్లో వర్షపు నీరు నిలిచి ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు, దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆయన అర్చకులు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం బంగారువాకిలి నుంచి లోనికి వెళ్లి ఆలయ గర్భాలయంలో ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ ఏఈవో పి.నటరాజారావు ఆయనకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.



కరాటం రాంబాబుకు వినతిపత్రం ఇస్తున్న గిరిజన యువతీ, యువకులు

న్యాయం చేయాలంటూ కరాటం రాంబాబుకు వినతి

బుట్టాయగూడెం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఎంపిక విషయంలో తమకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబును గిరిజన యువతీ, యువకులు కలిసి వినతి పత్రం అందజేశారు. తామంతా ఏటీవో ఎస్టీ నిరుద్యోగులమని కానిస్టేబుళ్ల ఎంపికలో అన్ని జిల్లాల్లో ఎస్టీ కోటాలో పోస్టులిచ్చిన అధికారులు ఏలూరు జిల్లాలో ఒక్క ఎస్టీ పోస్టు కూడా తీయలేదని తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతంలో 75 శాతం ఎస్టీలకు కేటాయించాలని తమకు అన్యాయం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని అనేక మంది ఎస్టీ యువత పరీక్షలో అర్హత సాధించినా పోస్టులు కేటాయించలేదన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే రోషన్

ఏలూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గంలో సంక్షేమ ఫలాలను పార్టీలకతీతంగా అందిస్తామని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలం కల్యాణంపాడులో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటికే 80శాతం నెరవేర్చామన్నారు. మోరంపూడి మల్లికార్జునరావు, తాతిన రాధాకృష్ణ, అసిలేటి అజయ్ పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి

టి.నర్సాపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురం సొసైటీ డిపాజిట్‌దారులు రైతులకు న్యాయం చేయాలని కోరుతూ భీమడోలు క్యాంపు కార్యాలయంలో ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి, కలిసి వినతిపత్రం అందజేశారు. డిపాజిట్ దారులకు డిపాజిట్‌లు ఇప్పించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. గత 50 ఏళ్లకు పైగా టి.నర్సాపురం బస్టాండ్ సమీపంలో ఎర్రచెరువు ప్రాంతంలో నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేసి ఇంటి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ విషయంపై జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో కలెక్టర్ అధికారులతో మాట్లాడాలని కోరినట్టు తెలిపారు.

లక్కవరంలో శివాలయం పునర్నిర్మాణంపై చర్చ



గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): లక్కవరం శివాలయాన్ని పునర్నిర్మించే నిమిత్తం ఆదివారం దేవదాయ శాఖ అధికారులు పరిశీలించారు. మద్ది దేవస్థానం ఈవో ఆర్.వి.చందన, దేవదాయ శాఖ డీఈ శ్రీనివాస్, గోకుల పారిజాతగిరి దేవస్థాన ఈవో కలగర శ్రీనివాస్ ఆలయ నిర్మాణంపై చర్చించారు. లక్కవరం శివాలయం నిర్మాణానికి సీజీఎఫ్ నిధులు రూ.1.5 కోట్లు మంజూరు కాగా మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.50 లక్షలు గ్రామస్థులు జమ చేసినట్టు అధికారులు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. జంగారెడ్డిగూడెంలోని శ్రీసీతారామస్వామి దేవస్థానానికి చెందిన కాలక్షేప కల్యాణ మండపం గత కొంత కాలంగా నిరుపయోగంగా ఉండడంతో వ్యాపారులకు గొడౌన్ లీజు నిమిత్తం ఇవ్వనున్నట్టు తెలిపారు.

సాహితీవేత్త బందా కన్నుమూత



ఏలూరు రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త, పూర్వపు ఐటీఐ ప్రిన్సిపల్, వ్యాఖ్యాత హిందూ యువజన సంఘం(వైఎంహెచ్ఏ) సభ్యులు, కళారంగంలో ఎన్నో సంస్థలకు విశిష్ట సేవలందించిన వి.బందా(74)(వెంకయ్య బందా) శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం ఏలూరు సత్రంపాడులోని విద్యావికాస్ వద్ద నివాసంలో పార్థివ దేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. బందా సాహిత్య రంగంలో రాష్ట్రంలో ఎన్నో కళాసంస్థలకు విలువైన సేవలందించారు. ఆయన మృతి పట్ల ఏలూరులోని కళా సంస్థలు హిందూ యువజన సంఘం అనేక సాహిత్య, కళా సంస్థల సభ్యులు సంతాపాన్ని తెలియజేశారు.

దివ్యాంగుల పట్ల ఆదరణ అభినందనీయం

భీమడోలు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పట్ల వి ఘ్నేశ్వరసేవా సమితి చూపుతున్న ఆదరణ అభినందనీయ మని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ అన్నారు. గుండుగొలనులో స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం బడేటి శ్రీహరిరావు, మామిళ్ళపల్లి గంగరాజు పేరు మీద దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, పండ్లు అంద జేశారు. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఏఎంసీ ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, శేషపు శేషగిరి, డి.సీతారామరాజు, కొండబాబు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల అందజేత

ఏలూరుటూటౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్నవారికి చేయూత నందించాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ప్రపంచ స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మారం హనుమంతరావు ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు లాయర్ సురేశ్, జగదీశ్, నెహ్రూ, వాసు, గంగా ధరరావు, విజయవర్మ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సహకారం..బలోపేతం!

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో 153సహకార సంఘాలుండగా, వీటి సంఖ్య పునర్వ్యవస్థీకరణతో 200కు పెరగవచ్చని చెబుతున్నారు.

పునర్వ్యవస్థీకరణలో పాల ఉత్పత్తిదారులు, ఫిషర్‌మెన్ సొసైటీలు

జిల్లాలో వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ, ఆక్వా రంగం ఉండటంతో ఆయా విభాగాల్లోనూ సొసైటీల ఏర్పాటుకు కసరత్తు చేయనున్నారు. పునర్వ్యవస్థీకరణలో పాల ఉత్పత్తిదారులు, ఫిషర్‌మెన్ సొసైటీలను పెంచనున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా త్వరలో దీనిపై నియోజకవర్గాలు, మండలాల వారీగా కసరత్తులు చేయనున్నారు. జిల్లాలో పోలవరం నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటైన పునరావాస కాలనీల్లోను కొత్తగా సొసైటీలను ఏర్పాటు చేయడానికి అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. దీనిపై డీసీవో శ్రీనివాస్‌ను ఆంధ్రజ్యోతి సంప్రదించగా పునర్వ్యవస్థీకరణకు ఆదేశాలు వచ్చాయని, దీనిపై త్వరలో కీలక నిర్ణయాలను అధికారులు, డీసీసీబీ, డీసీఎంఎస్ పాలకపక్షాలతో కలిసి తీసుకుంటామన్నారు.

అడుగంటుతున్న ఆశలు..

- వరి సాగు కష్టమే అంటున్న మెట్ట రైతులు
- ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి
- కాలువల నుంచి అందని నీరు
- అడుగంటుతున్న చెరువులు
- రెండేళ్లలో భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం

చింతలపూడి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన చింతలపూడి నియోజకవర్గంలో వరి సాగంటేనే రైతులు భయపడుతున్నారు. ప్రధాన కారణం సాగు నీటి కొరతే.. సుమారు 25 వేల ఎకరాలను చెరువుల కింద సాగు చేస్తుండగా మరో 13 వేల ఎకరాలు గొట్టపు బావులపై ఆధారపడి సాగు చేస్తున్నారు. మిగిలిన మండలాల్లో ఉద్యానవన పంటలు ఎక్కువగా సాగు చేస్తుంటారు. దేనికైనా సాగు నీరు కావాల్సిందే. ఉద్యానవన పంటలన్నీ గొట్టపు బావుల ద్వారా సాగవుతోంది. వరికి మాత్రం నీరు ఎక్కువగా కావాల్సి ఉంటుంది. కొందరు రైతులు సాగు ఖర్చులు, సాగునీటి సమస్యలతో వెదజల్లేలా ఈ మధ్యకాలంలో సాగును పెంచారు. నాలుగేళ్ల క్రితం మండలంలో అత్యధికంగా 17 వేల ఎకరాలు అప్పటి వర్షపాతం ఆధారంగా సాగు చేశారు. అయితే గత రెండేళ్ల నుంచి ఈ సాగు ఐదు వేల ఎకరాలకు తగ్గిపోయింది. వీరంతా ఆయిల్ పామ్‌పై మొగ్గు చూపారు. చెరువులు ఉన్న ఆయకట్టు దిగువున గొట్టపు బావులు వేసి పామాయిల్ పంట సాగు చేస్తున్నారు. దీంతో 12 వేల ఎకరాలకు మాత్రమే మండలంలో వరి సాగవుతోంది. వీరిని కూడా సాగునీటి సమస్య వేధిస్తోంది. చింతలపూడి మండలంలో అంధ్ర కాలువ ఆధారంగా ఏడు వేల ఎకరాలు, తమ్మిలేరు ఆధారంగా సుమారు వెయ్యి ఎకరాలు సాగవుతోంది. ఇదిలా ఉండగా అంధ్ర కాలువకు నీరు రాక ఆయకట్టు రైతులు చెరువులపై ఆధారపడుతున్నారు. అవి కూడా వర్షాధారమే. ఇప్పటి వరకు 12 వేల ఎకరాల్లో వరిసాగు నాట్లు పడాల్సి ఉండగా పది వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. అవికూడా కొద్దిరోజుల క్రితమే నాట్లు పడ్డాయి. మే, జూన్ నెలల్లో సాధారణం కంటే కొద్దిగా వర్షపాతం నమోదైంది. మేలో 116.6 మిల్లీమీటర్లు పడాల్సి ఉండగా 179.6, జూన్‌లో 145 మిల్లీమీటర్లకు గాను 181.4 వర్షపాతం నమోదైంది. ఇక జూలైలో ఎక్కువగా నాట్లు వేసే సమయం. 294 మిల్లీమీటర్లు పడాల్సి ఉండగా 258 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. 36 మిల్లీమీటర్లు వర్షపాతం తక్కువ. గత వారం రోజులుగా ఈ ప్రాంతంలో ఎండలు మండిపోతున్నాయి. చెరువుల్లో చేరిన నీరు ఒక తడికి మాత్రమే సరిపోతాయని రైతులు చెబుతున్నారు. ఇంకా రెండు వేల ఎకరాలకుపైగా వరి నాట్లు పడాల్సి ఉంది. ఇదిలా ఉంటే నాటిన రైతులు, నాట్లు పడాల్సిన రైతుల్లో వర్షంపై భయం భయంగా గడుపుతున్నారు. ఇప్పటికే ఐదు వేల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేస్తున్నారు. చెరువులు కూడా నానాటికి ఆక్రమణలకు గురై పూడికలు తీయక నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. ఏ అధికారులు దీనిపై పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పుడు పది రోజుల్లో వర్షం లేకపోతే వేసిన నాట్లు కూడా ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. శాశ్వత సాగునీటి జలాలు ఎప్పుడు వస్తాయని రైతులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.



పాత చింతలపూడిలో నీరులేని నారుమడి

స్వచ్ఛందంగా రహదారుల నిర్మాణం



రహదారిని నిర్మించుకుంటున్న కొండపల్లి వాసులు

కుక్కునూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కొండపల్లి గ్రామానికి చెందిన రైతులు స్వచ్ఛందంగా పొలాలకు వెళ్లే రోడ్లను నూతనంగా నిర్మించుకోవడంతో పాటు మరమ్మతులు చేసుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. దీంతో రైతులే స్వయంగా ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుని ఎక్స్‌వేటర్ సాయంతో రోడ్లు మరమ్మతులు చేసుకుంటున్నారు. దాదాపు రూ.లక్ష రూపాయలతో ఈ నిర్మాణాలు చేపట్టారు. భద్రాచలం - కుక్కునూరు రహదారిలో సైతం వంతెన కుంగిపోవడంతో మరమ్మతులు చేశారు.



సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

అన్నవరంలో స్వామి నామ సంకీర్తన

కామవరపుకోట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అన్నవరంలోని శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయానికి 90 మంది భక్తులు కామవరపుకోట నుంచి తరలివెళ్లారు. వీరంతా స్వామినామ సంకీర్తన కైంకర్యానికి యాత్రగా వెళ్లారు. ఈమేరకు వెంకట రామరాయ కళామందిరం వద్ద ఉన్న వేదికపై విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. భాగవత సదన సభ్యులు, సద్గురువులు తిరుక్కోవల్లూరి శ్రీనివాస పెరుమాళ్, భాస్కరరావు బృందం పాల్గొన్నారు.

మానవత విద్యానిధికి రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న దృశ్యం

కామవరపుకోట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తడికలపూడి మానవత శాఖ అధ్యక్షుడు పావులూరి చంద్రలాల్ గాంధీ పేద విద్యార్థుల కోసం మానవత విద్యానిధికి రూ.లక్షా 116 చెక్కును అందజేశారు. సంస్థ డైరెక్టర్లు కె.గంగాధర ప్రసాద్, నెక్కలపూడి సురేష్‌బాబు, ఈడ్పుగంటి అనీల్, నల్లూరి కాంతారావు, అత్యం వెంకటేశ్వరరావు, జాదం నరేష్, ముళ్ళపూడి బాబి, గారపాటి సత్యనారాయణ, నల్లూరు గంగరాజు, బొంతు సౌజన్య, మేకల రంగమ్మ, పెరవలి ప్రభాకరరావు, మోటుపల్లి శ్రీను ఉన్నారు.

వైద్య భగవానుడికి అభిషేకాలు



ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పవరు పేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుడి ఆలయం వద్ద శ్రావణ మాసంలోని రెండవ ఆదివారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శిం చుకుని అర్చకులు రాళ్ళబండి ఆదినారాయణ శర్మ ద్వారా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి రక్షాబంధనాలు కట్టించుకున్నారు. వనమూలికల తీర్థాన్ని స్వీకరించారు. భజనలతో స్వామివారిని ఆరాధించారు. ఆలయ ఛైర్మన్ కోరాడ రెడ్డి, బూరాడ పూర్ణచంద్రరావు, మిత్రబృందం భక్తులకు ఏర్పాట్లు చేశారు.

ప్లాష్ టీమ్ సేవలు అభినందనీయం

ఏలూరుటూటౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సమాజానికి ప్లాష్‌టీమ్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాష్ టీమ్ ఆధ్వర్యంలో కేపీడీటీ హైస్కూల్లో జయహో సంస్మరణోత్సవం నిర్వహించారు. జడ్పీ ఛైర్ పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ ప్లాష్‌టీం సేవలను కొనియాడారు. అనంతరం స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, ప్లాష్ టీమ్ ప్రతినిధులు యర్రంశెట్టి శ్రీనివాస్, నాగేశ్వరరావు, కార్పొరేటర్ సాంబశివరావు, చల్లా వెంకటసత్యవరప్రసాద్ పాల్గొన్నారు.



శ్రీగాంధీ ఆంధ్రా జాతీయ మహావిద్యాలయంలో స్నేహితులు



భీమడోలులో పూర్వ విద్యార్థుల సందడి

ఘనంగా స్నేహితుల దినోత్సవం

ఏలూరు రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీగాంధీ ఆంధ్రా జాతీయ మహావిద్యాలయం 2000 సంవత్సరం పూర్వ విద్యార్థులు ఘనంగా స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. కేక్ కట్ చేసి సందడిగా గడిపారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ స్నేహానికి ఎలాంటి భేదాలు ఉండవన్నారు. తల్లి దండ్రుల తర్వాత స్వచ్ఛమైన ప్రేమను పంచేది స్నేహితులే అని అన్నారు. స్నేహితులంతా కలిసి సహపంక్తి భోజనాలు చేసి ఉత్సాహంగా గడిపారు.

● భీమడోలు: భీమడోలు మండల హైస్కూల్లో స్నేహితుల దినోత్సవం ఘనంగా జరిగింది. జడ్పీ హైస్కూల్లో 2000-21 సంవత్సరానికి సంబంధించి టెన్త్ పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుని కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

● దెందులూరు: ఎన్ని బాధలు, కష్టాలున్నా చివరి వరకు కలిసి ఉండే వారిదే నిజమైన స్నేహ మని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి సుకరాజు అన్నారు. ఆదివారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో విద్యార్థులు స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు కొంత మంది ఫ్రెండ్ షిప్ బ్యాండు కట్టుకుని స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు.



రైల్వే ఓవర్ బ్రిడ్జిని పట్టించుకోరేం

కూలిన రక్షణ గోడలు నిర్మించాలని డిమాండ్

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలో జూట్‌మిల్లు సెంటర్ నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు నిర్మించిన రైల్వే ఫ్లైవోవర్ బ్రిడ్జిపై రక్షణ గోడలు కూలి ప్రమాదకరంగా కనిపిస్తున్నా పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వెల్లివెత్తుతున్నాయి. జూట్‌మిల్లు సెంటర్ నుంచి ఫ్లైవోవర్ ఎక్కే తరుణంలో రోడ్డుకు ఎడమవైపున రెండు చోట్ల,దిగే తరుణంలో రోడ్డుకు ఎడమవైపున మరో చోట రక్షణ గోడలు కూలి దర్శనమిస్తున్నాయి. నిత్యం అనేక ద్విచక్ర వాహనాలు, ఆటోలు, లారీలు, బస్సులు, వ్యానులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు ప్రజాప్రతినిధులు కలుగ చేసుకుని ఈ ఫ్లైవోవర్ బ్రిడ్జిపై తొలగిన రక్షణ గోడల ప్రాంతంలో తిరిగి పునర్నిర్మించడంగాని, లేదా రెయిలింగ్స్ ఏర్పాటు చేయడంగాని చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఫ్లైవోవర్‌పై కూలిన రక్షణ గోడ

రహదారులకు శంకుస్థాపనలు

ఉంగుటూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమితో ఉన్న అవగాహనతోనే రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి రూ.5 వేల కోట్లు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చేసిన రహదారుల శంకుస్థాపనలపై ఆయన ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో సి.ఎం, డి.సి.ఎం.లకు ధన్యవాదాలు తెలిపారు.



వృద్ధాశ్రమంలో అన్నదానం

పోలవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ స్మారక వృద్ధాశ్రమంలో వృద్ధులకు పోలవరం ప్రాజెక్టు ప్రత్యేక పోలీసు భద్రతా బలగాల హెడ్ కానిస్టేబుల్ పి.రాజేష్ కుమార్ ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. తన మనవడు దాడి ఖుషీ ద్వితీయ పుట్టిన రోజును పురస్కరించుకుని అన్నదానం నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం ప్రాజెక్టు చెక్‌పోస్టు కార్యాలయం వద్ద సహోద్యోగులకు విందు ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు భద్రతా సిబ్బంది సీఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



వేలేరుపాడులో సంతకాలు సేకరిస్తున్న నాయకులు



టి.నరసాపురంలో సంతకాలు సేకరిస్తున్న దృశ్యం



ఏలూరులో మాట్లాడుతున్న నాయకులు

స్మార్ట్ మీటర్లు మాకొద్దు..

వేలేరుపాడు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆదివారం మండలంలోని రుద్రమ్మకోట గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.స్మార్ట్‌మీటర్ల వల్ల కలిగే అనర్థాలు వివరించారు. ఈ నెల 5న విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వేలేరుపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ధర్నా నిర్వహిస్తున్నందున ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మున్నీర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కారం దారయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్టా ప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి బాడిస రాము పాల్గొన్నారు.

● కుక్కునూరు: స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ చీరవల్లిలో ఆదివారం వామపక్ష నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. సీపీఐ మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య, సీపీఎం జిల్లా నాయకులు వై.నాగేంద్రరావు, వై.సాయికిరణ్, రమేశ్ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు

● టినర్సాపురం: స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు బి.ఎన్.సాగర్ పిలుపునిచ్చారు. ఆదివారం విద్యుత్ బిల్లుల పెంపు, స్మార్ట్ మీటర్లు బిగింపు తదితర సమస్యలపై వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో సీపీఐ జిల్లా సమితి సభ్యులు బి.ఎన్.సాగర్, సీపీఎం నాయకులు జి.వెంకట్రావు, అలుమోలు మురళీ, మడకం కుమారి, సీపీఐ(ఎంఎల్) జనశక్తి నాయకులు కె.భాస్కర్, కొండా రాములు, స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలన వివరిస్తూ భవిష్యత్తులో విద్యుత్ సంస్థను క్రమక్రమంగా ఎలా ప్రైవేటీకరిస్తారో వివరిస్తూ ఆదివారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ నెల 5న జరిగే ముట్టడి కార్యక్రమానికి మండలంలోని ప్రజలంతా హాజరుకావాలన్నారు.

● ఏలూరుకార్పొరేషన్: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉప సంహరించుకోవాలనే నినాదంతో ఈనెల 5న జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే పేర్కొన్నారు. ఆదివారం స్థానిక స్ఫూర్తి భవన్‌లో ఏఐటీయూసీ అనుబంధ ఏలూరు పట్టణ పొగాకు పనివార్ల సంఘం జరిగిన విస్తృత సమావేశానికి సంఘ అధ్యక్షులు బరగడ పోతురాజు అధ్యక్షత వహించారు. డాంగే మాట్లాడుతూ అదనపు చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం సరికాదన్నారు. యూనియన్ కార్యదర్శి పుప్పాల శ్రీనివాసరావు కార్యకలాపాల రిపోర్టును, జమా ఖర్చులను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో ఆర్యవరపు వెంకటేశ్వరరావు(చిన్ని), పసుపులేటి దుర్గారావు, ఉప్పు గంగాధరరావు, ఏఐటీయూసీ నాయకులు పళ్లెం కిశోర్ పాల్గొన్నారు. ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యుత్ కేంద్రాల వద్ద నిర్వహించే ధర్నాలు జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావులు పిలుపునిచ్చారు. స్ఫూర్తి భవనం నుంచి జూమ్ మీటింగ్ నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పాల్గొన్నారు.

మానవత కార్యవర్గ సభ్యుడిగా సురేశ్ బాబు

దెందులూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మానవత సంస్థ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా దెందులూరు నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు, తాళ్ళ గోకవరం గ్రామ సర్పంచ్ నెక్కలపూడి సురేశ్ బాబును ఏకగ్రీవంగా ఎంపికచేశారు. మండూరు బ్యాంక్ ఛైర్మన్ కొనకళ్ల శివమణిగౌడ్,కొనకళ్ల వెంకటకృష్ణారావు, బడుగు సత్యనారాయణ, నానితో పాటు పలువురు బొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చాటపర్రు సెక్షన్ గుడివాక లంక సబ్‌స్టేషన్ పరిధిలో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖాధికారులు అంబేడ్కర్, నర్సయ్య తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు కొక్కిరాయిలంక, పైడిచింతపాడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

యువకుడి అదృశ్యం

ఏలూరు క్రైం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మతి స్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు తిరిగి రాలేదు. దీంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు వన్‌టౌన్ పడమర వీధి పాలతూము సెంటర్‌కు చెందిన దొంతంశెట్టి సత్యనారాయణ (31)కి మతి స్థిమితం సరిగా లేదు. గత నెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగిరాలేదు. ఆచూకీ లభించకపోవడంతో తండ్రి దొంతంశెట్టి వెంకటేశ్వరరావు ఆదివారం ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కావాలనే ఎమ్మెల్యేపై కుట్ర

జీలుగుమిల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక కుట్రలు చేస్తున్నారని జనసేన పార్టీ మండలాధ్యక్షులు పసుపులేటి రాము అన్నారు. ఏడాదిలో వంద కోట్లు అర్జించినట్టు వీడియో ద్వారా అసత్య ప్రచారం చేస్తున్న వారిపై కేసు వేస్తామన్నారు. జనసేన పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ నియోజకవర్గంలో ఆయా మండలాల జనసేన నాయకులు ఎమ్మెల్యేపై జరిగిన అసత్య ఆరోపణల్ని ఖండించారు. కూటమి ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాల్లో భాగంగానే కుట్రలు చేస్తున్నారని జనసేన పార్టీ నాయకులు కోలా మధు, మురారి బాలాజీ, శాంతి కుమార్, తులసి పేర్కొన్నారు.

అసత్యప్రచారం తగదు

కుక్కునూరు: పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని జనసేన పార్టీ నాయకులు ఖండించారు. నియోజకవర్గంలో కొందరు అసత్యపు ఆరోపణలు చేస్తూ ఎమ్మెల్యేకు, జనసేన పార్టీకి చెడ్డ పేరు తెస్తున్నారంటూ విమర్శించారు. గత 20ఏళ్లగా చేయని అభివృద్ధి ఒక్క ఏడాదిలోనే ఎమ్మెల్యే బాలరాజు చేశారని అన్నారు. సమావేశంలో జనసేన నాయకులు వెంకన్నబాబు,జీ.నాగరాజు, జగదీశ్, స్వామి పాల్గొన్నారు.



అర్ధంతరంగా ఆగిపోయిన బస్సు

కండీషన్ లేని బస్సులతో ఇక్కట్లు

ద్వారకాతిరుమల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేని ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులు నానాకష్టాలు పడుతున్నారు. కొన్ని సాంకేతిక కారణాలతో, మరికొన్ని టైర్లు పంక్చర్ కావడం వంటి కారణాలతో బస్సులు అర్ధంతరంగా నిలిచిపోతూ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఈక్రమంలో జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు ఆదివారం సాయంత్రం జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్తూ మార్గమధ్యలో ద్వారకాతిరుమల పోలీస్టేషన్ రోడ్డులో ఆగిపోయింది. టైర్ పంక్చర్ కావడం వల్లే బస్సు ఆగిందని సిబ్బంది చెబుతున్నారు. ఆడమిల్లి వద్ద రోడ్డు సరిగాలేక జంగారెడ్డిగూడెం - ఏలూరు బస్సులు ద్వారకాతిరుమల మీదుగా వెళ్తున్నాయి.

ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకం

ఏలూరుటూటౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునివ్వడం హర్షనీయమని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు అన్నారు. దత్తాశ్రమం రోడ్డులో ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని అన్నారు. ఎస్సీఎస్టీబీసీ, మైనార్టీలు రాజ్యాధికారం దిశగా ప్రయాణం చేయాలని పిలుపునిచ్చారు. ఎంఆర్‌పీఎస్ కోకన్వీనర్ కాశీకృష్ణ, బయ్యారపు కుటుంబరావు, పి.చినబాబు, బాబ్జీ, థామస్, సతీశ్, పుల్లారావు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన

కుక్కునూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో నరసింహరావు తెలిపారు. ఈ నెల 5న ప్రతీ సచివాలయం పరిధిలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది గ్రామస్థుల సాయంతో వాట్సాప్ గవర్నెనెన్స్‌పై అవగాహన కల్పించాలన్నారు.మనమిత్ర యాప్ ద్వారా సుమారు 530 సేవలు ఇంటి నుంచే పొందవచ్చన్నారు.ఏమైనా సమస్యలుంటే ఇంటి నుంచి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

వాహనం నడిపేటప్పుడు ఫోన్‌లో మాట్లాడవద్దు : ఎస్‌ఐ

ఆగిరిపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ శుభశేఖర్ అన్నారు. మండలంలోని వడ్లమాను గ్రామంలో ఆదివారం ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడవద్దని, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. లైసెన్సు లేకున్నా, హెల్మెట్ ధరించకున్నా జరిమానా తప్పదని హెచ్చరించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ముదినేపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెదకొమర్రు గ్రామంలో అనారోగ్యంతో ఆదివారం మరణించిన పాస్టర్ చలపాక గిద్యోను అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పాస్టర్ కుటుంబాన్ని పరామర్శించి వైష్ణవి తరఫున ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ సహాయాన్ని అందజేశారు.



ముళ్ళపొదల తొలగింపును పరిశీలిస్తున్న సీఐ కృష్ణ, ఎస్సై శ్రీను

పోలీసుల సమాజ సేవ

పాఠశాలలో ముళ్లపొదలు తొలగింపు

కైకలూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బాలికల పాఠశాల ఆవరణలో దట్టమైన పొదలు అలుముకున్నా పట్టించుకోకపోవడంతో కైకలూరు టౌన్ పోలీసులు వీటిని తొలగించేందుకు ఆదివారం శ్రీకారం చుట్టారు. కైకలూరు టౌన్ సీఐ పి. కృష్ణ, ఎస్సై ఆర్. శ్రీను ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సహాయంతో కైకలూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. ఇటీవల పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు వెళ్లిన పోలీసులకు దట్టమైన పొదలు కనిపించాయి. వీటిలో పాములు, పురుగులు సంచరిస్తుండటంతో భయభ్రాంతులకు గురవుతున్నామని బాలికలు పేర్కొనడంతో పోలీసులే ఈ పనులను ప్రారంభించారు. పోలీసులు శాంతిభద్రతలతో పాటు సామాజిక అభివృద్ధికి కృషి చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న పంకజ్ కుమార్

సైన్స్‌లో విద్యార్థుల సామర్థ్యం పెంచాలి

ఆగిరిపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జీవశాస్త్రంలో విద్యార్థుల సామర్థ్యం పెంచాలని ఏలూరు సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. పంకజ్ కుమార్ అన్నారు. తోటపల్లిలోని హీల్ పాఠశాలలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ జీవశాస్త్ర ఉపాధ్యాయినులకు ఆదివారం రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఈ శిక్షణలో 15 జిల్లాల నుంచి 170 మంది ఉపాధ్యాయినిలు పాల్గొన్నారని తెలిపారు. 8 మంది రిసోర్స్ పర్సన్స్ జీవశాస్త్రంపై అవగాహన కల్పించారు. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు జీవశాస్త్రంపై పట్టు సాధించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఐదు రోజుల పాటు సాగుతుందని తెలిపారు. జీవశాస్త్రంలో విద్యార్థులు 50కి 50 మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ల్యాబ్స్ మెరుగుపరిచి, ప్రయోగాలు నిర్వహించాలన్నారు. ఏఎంఓ రెడ్డి రామారావు, ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి. నవీన, ఆగిరిపల్లి ఎంఈవో-2 కొవ్వలి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాల వితరణ

కలిదిండి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో 1992-93లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి పంచారు. అలనాటి స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం కలిదిండి పంచాయతీలో పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు బియ్యం, గుడ్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆత్మీయ సమ్మేళనంతోపాటు సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయమని కలిదిండి సర్పంచ్ మారుతీ ప్రసన్న అన్నారు. పూర్వ విద్యార్థులు పీవీవీ రవికుమార్, ఎం.సోమేశ్వరరావు, గోదావరి సుబ్రహ్మణ్యం, ఒడిగిన దుర్గా ప్రసాద్, ఆరోగ్య జీవరత్నం, రాంబాబు, లలితా ప్రసాద్, జాఫర్ అహ్మద్, రాజీగుప్త తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. నూజివీడు సుందరయ్య భవన్‌లో ఎన్‌ఆర్ హనుమాన్లు అధ్యక్షతన జరిగిన సీఐటీయూ సభలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా జి.రాజు, మరో 20 మంది సభ్యులుగా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు అన్నారు. నూజివీడులో నిర్వహించిన ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీలను ప్రభుత్వం తక్షణం అమలు పరచాలని, సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

సహకారం.. బలోపేతం!

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో 153 సహకార సంఘాలుండగా, వీటి సంఖ్య పునర్వ్యవస్థీకరణతో 200కు పెరగవచ్చని చెబుతున్నారు.

పునర్వ్యవస్థీకరణలో పాల ఉత్పత్తిదారులు, ఫిషర్‌మెన్ సొసైటీలు

జిల్లాలో వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ, ఆక్వా రంగం ఉండటంతో ఆయా విభాగాల్లోనూ సొసైటీల ఏర్పాటుకు కసరత్తు చేయనున్నారు. పునర్వ్యవస్థీకరణలో పాల ఉత్పత్తిదారులు, ఫిషర్‌మెన్ సొసైటీలను పెంచనున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా త్వరలో దీనిపై నియోజకవర్గాలు, మండలాల వారీగా కసరత్తులు చేయనున్నారు. జిల్లాలో పోలవరం నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటైన పునరావాస కాలనీల్లోను కొత్తగా సొసైటీలను ఏర్పాటు చేయడానికి అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. దీనిపై డీసీవో శ్రీనివాస్‌ను ఆంధ్రజ్యోతి సంప్రదించగా పునర్వ్యవస్థీకరణకు ఆదేశాలు వచ్చాయని, దీనిపై త్వరలో కీలక నిర్ణయాలను అధికారులు, డీసీసీబీ, డీసీఎంఎస్ పాలకపక్షాలతో కలిసి తీసుకుంటామన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



నత్తగుల్లపాడుకు వెళ్లే రహదారి వద్ద హెచ్చరిక బోర్డుల్లేని దృశ్యం



వదర్లపాడు బ్రాంచి వద్ద సగం విస్తరణ పనులు చేసి వదిలివేసిన దృశ్యం

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణ సంకటం

- ప్రమాదాలకు నిలయంగా మారిన 165వ జాతీయ రహదారి..
- విస్తరణ పనుల్లో అడుగడుగునా కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం
- మృతుల కుటుంబాలకు డబ్బులిచ్చి కేసుల మాఫీ
- ప్రమాదాలు నివారించాలని ప్రజల వినతి

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో అడుగడుగునా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం... అధికారుల అలసత్వం కన్పిస్తోంది. ఎక్కడ చూసినా రహదారి విస్తరణ పనులు సగభాగం చేయడం.. మరో సగ భాగం వదిలివేయడం.. అక్కడ ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు నెలవుగా 165వ జాతీయ రహదారి మారింది.

కైకలూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలంలో గోనెపాడు నుంచి ఉప్పుటేరు వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. సుమారు 15 కిలోమీటర్ల పొడవునా పనులు నిర్వహిస్తున్నారు. గోనెపాడులో ఎన్‌హెచ్ పనులు ప్రారంభమయ్యే ప్రదేశంలో ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. అక్కడి వరకు రోడ్డు బాగుండడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు వేగంగా వెళ్లి ఒక్కసారిగా గోతుల్లో పడుతున్నాయి. అనేక మంది ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం. అలాగే మధ్యమధ్యలో రహదారిని కొద్ది భాగం వదిలివేసి మరో ప్రదేశం నుంచి అభివృద్ధి పనులను చేపడుతున్నారు. ఆ ప్రాంతాల్లో కూడా ఎక్కడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన చోటుచేసుకున్నప్పటికీ అధికారుల్లో చలనం లేదు.

●అలాగే భుజబలపట్నం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు రాళ్ల దెబ్బలు తగులుతున్నా స్పందించలేదు. రహదారి ప్రారంభం సమయంలోనూ శింగాపురం నుంచి నత్తగుల్లపాడు వెళ్లే రహదారి వద్ద, అలాగే వదర్లపాడు బ్రాంచ్ వద్ద, పల్లెవాడ-ఆలపాడు గ్రామాల మధ్య, భుజబలపట్నం-పల్లెవాడ గ్రామాల మధ్యన ఎన్‌హెచ్ పనులు జరుగుతున్నప్పటికీ ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రాత్రి సమయాల్లో ఎన్‌హెచ్ పనులు కనిపించకపోవడంతో నేరుగా వాహనాలు గోతుల్లో దిగబడుతున్నాయి. రహదారి నిర్మించి పాత రోడ్డుకి కలిపే ప్రదేశాలు కనిపించేలా చర్యలు చేపట్టలేదు. దీంతో ఎక్కువ ప్రమాదాలకు నిలయంగా ఈ రహదారి మారింది.

●భైరవపట్నం గ్రామంలో దాదాపుగా ఎన్‌హెచ్ రహదారి పనులు పూర్తిచేసినా బైపాస్ కనెక్టివిటీ దగ్గర నిర్మాణ పనులు పూర్తి చేయకుండా వదిలివేశారు. దీంతో మండవల్లి వైపు నుంచి వేగంగా వస్తున్న వాహనాలు ఒక్కసారిగా గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి.

●మండవల్లి సెంటర్లో టెలిఫోన్ ఆఫీసు వద్ద యూ-టర్న్ ఏర్పాటుచేశారు. ఆ ప్రదేశంలో పూర్తి స్థాయిలో పనులు నిర్వహించకుండా కొద్దినెలలుగా వదిలేయడంతో అక్కడ ద్విచక్ర వాహనం కూడా తిరగలేని పరిస్థితి ఏర్పడి తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం ఏ మేరకు ఉందో జరిగిన ప్రమాదాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎన్‌హెచ్ అధికారులు ఉదాసీనత, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలకు నిలయంగా మారిన 165 జాతీయ రహదారి విస్తరణ పనులు వేగంగా పూర్తిచేయాలని, నిర్మాణం జరిగే ప్రదేశాల్లో ప్రమాదాలకు తావులేకుండా తగు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాలు..

●గత నెల 30న ముదినేపల్లి మండలంలో జాతీయ రహదారిపై హెచ్చరిక బోర్డులు లేక పోల్‌రాజ్ కాలువలో కారు దూసుకుపోయి ఒకరు మృతి చెందిన సంఘటన పాఠకులకు విదితమే.

●అలాగే మండవల్లి మండలం భైరవపట్నం గ్రామంలో ఓ యువకుడు ఎన్‌హెచ్ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశంలో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందగా కాంట్రాక్టరు రూ.లక్షల్లో పరిహారం చెల్లించి సెటిల్మెంట్ జరుపుకున్నారు.

●రెండేళ్ల క్రితం మండవల్లి తరుగుమూల ప్రదేశంలో మండవల్లి పోలీసుస్టేషన్లో ఏఎస్సైగా పనిచేస్తున్న రాజు ద్విచక్ర వాహనంపై వస్తూ ఎన్‌హెచ్ నిర్మాణ పనులు కనిపించకపోవడంతో సమీపంలోని మట్టిగుట్టలను ఢీకొట్టి వెన్నుపూసకు బలమైన గాయమైంది. రెండేళ్ల పాటు చికిత్స పొందిన అనంతరం ఆయన విధుల్లో చేరారు.



చాట్రాయిలో కాలిబాటలు వేసిన వరి పొలం

కాలిబాట.. లాభాల పంట

వరి సాగులో శాస్త్రవేత్తల సూచనలు

చాట్రాయి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వరిసాగులో కాలిబాటల విధానం అనుసరిస్తే అనేక ప్రయోజనాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇటీవల కాలంలో చాలామంది ఔత్సాహిక రైతులు వరిసాగులో కాలిబాటల విధానం అనుసరిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. వరినాట్లు వేసిన 15 రోజుల వ్యవధిలో కాలిబాటలు వేసుకోవాలని, ప్లాస్టిక్ లేదా ఏదైనా తాడు తీసుకొని చేను గట్టుకు ఒకవైపు నుంచి మరోవైపుకు సాగదీసి కట్టాలని, కట్టిన తాడు వెంట 12 సెంటీ మీటర్లు వెడల్పు వరినాట్లు తొలగించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ విధానం వల్ల మొక్క వేరు భాగానికి సూర్యరశ్మి బాగా తగిలి చీడపీడల బెడద తగ్గుతుంది. కాలిబాటల వెంట తిరుగుతూ చల్లితే ఎరువులు పురుగు మందులు ప్రతి దుబ్బుకు చేరుతాయి. కలుపు తొలగించటానికి, తెగుళ్ల ఆశిస్తే సులభంగా గుర్తించడానికి, ఎలుకల నివారణకు అనువుగా ఉంటుంది. ఎకరానికి 3 నుంచి 4 బస్తాల అధిక దిగుబడి వస్తుంది. చాట్రాయి మండల ఏవో బి. శివశంకర్ మాట్లాడుతూ ఈ విధానం వల్ల కలుపు, చీడపీడల నివారణ, ప్రకృతి వైపరీత్యాలకు పైరు తట్టుకోవడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు.

దిగుబడులు ఆశాజనకం



వరిసాగులో కొన్నేళ్ల నుంచి కాలిబాటల విధానం అనుసరిస్తూ మంచి ఫలితాలు పొందుతున్నాం. చీడపీడలను అదుపు చేయడం, ఎరువులు పురుగు మందుల యాజమాన్య సులువుగా ఉంది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి.

- కట్టా నాగ దుర్గారావు,
రైతు, నరసింహారావుపాలెం.



మంత్రిని సన్మానిస్తున్న గ్రామస్థులు

ఆధ్యాత్మికత పెరగాలి : మంత్రి సారథి

ముదినేపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆధ్యాత్మికత మరింత పెరగాలని, అభివృద్ధికి అది దోహదపడుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పేరూరులో ఆదివారం గంగానమ్మ జాతరకు యాదవ సంఘ నాయకులు, జాతర నిర్వాహకుడు శంకరరావు ఆహ్వానం మేరకు మంత్రి పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం గ్రామంలో మూడేళ్ళ క్రితం పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్‌పై కూలిన వంతెనను పరిశీలించారు. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని మంత్రిని సర్పంచ్ మాధవీరాణి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సోమ సత్యనారాయణ కోరారు. టీడీపీ నాయకులు బొర్రా చలమయ్య, చల్లగొళ్ళ ఆదిత్య, టీకేఎం నాని, యాదవ సంఘం అధ్యక్షుడు కరేటి శ్రీహరి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు జడ్డు సత్యనారాయణ పాల్గొన్నారు. మంత్రిని ఘనంగా సత్కరించారు.



మట్టగుంటలో కరపత్రాల పంపిణీ



భైరవపట్నంలో సుపరిపాలనలో తొలి అడుగు

పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

కలిదిండి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ పథకాలు అందించటమే సీఎం చంద్రబాబు లక్ష్యమని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మట్టగుంటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కూటమి నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించి కరపత్రాలను అందజేశారు. సమస్యలు తెలుసుకున్నారు. కూటమి నాయకులు వడుగు గణపతి, కొప్పనాతి శంకర్, తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు, కొప్పనాతి రాము, మోకా పెద్దిరాజు, చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి క్లస్టర్-2లో ముగింపు

మండవల్లి: మండలంలో క్లస్టర్-2 పరిధిలోని 25 బూత్‌లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పూర్తిచేశారు. మండవల్లి, భైరవపట్నం, కానుకొల్లు, లింగాల, పెరికేగూడెం, మోకాస కలవ పూడి, గన్నవరం, అయ్యవారిరుద్రవరం, అప్పాపురం, చావలిపాడు, లోకుముడి గ్రామాల్లో 8,600 కుటుం బాలను కలిసి తెలుగుదేశం ప్రభుత్వ పథకాలు వివరించినట్లు క్లస్టర్ ఇన్‌చార్జి కూనపురెడ్డి కోటేశ్వర రావు తెలిపారు. ఆదివారం భైరవపట్నంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. కైకలూరు నియోజక వర్గం కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, టీడీపీ మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని వెంకట నాగేశ్వరరావు, కూటమి నాయకులు చాపరాల దుర్గా ప్రసాద్, సజ్జ సురేష్ బాబు, గన్నమనేని సుధాకర్ బాబు, క్లస్టర్ కూనపురెడ్డి కోటేశ్వరరావు, కో క్లస్టర్ గోల్కొండ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నీటి విడుదలను పరిశీలిస్తున్న జగన్మోహనరావు

పోల్‌రాజ్ కెనాల్‌కు నీటి విడుదల పెంచాలి

ముదినేపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): శివారు ఆయకట్టు భూములకు సాగునీరందించాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి, చిగురుకోట పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ చలసాని జగన్మోహనరావు కోరారు. మండలంలోని పోల్‌రాజ్ కెనాల్‌కు గుడ్లవల్లేరు లాకుల వద్ద నీటి విడుదలను రైతులతో కలసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ కెనాల్ కింద పలు బ్రాంచి కాల్వలకు నీరందక శివారు భూముల్లో వరి నాట్లు ఎండిపోతున్నాయని, అయ్యవారి రుద్రవరం బ్రాంచి కెనాల్ కింద చిగురుకోట, తామరకొల్లు భూములకు నీటి ఎద్దడి ఏర్పడిందని అధికారులకు వివరించారు. పోల్ రాజ్ కెనాల్‌కు నీటి విడుదలను 350 క్యూసెక్కులకు పెంచాలని ఇరిగేషన్ అధికారులను జగన్మోహనరావు కోరారు. గుడివాడ ఛానల్స్‌కు కూడా నీటి విడుదల పెంచాలన్నారు.



గోపవరంలో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల

ముసునూరు మండలంలో పశువైద్య శాలలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వీటిని పట్టించుకోకపోవడంతో మరింత అధ్వానంగా మారాయి. శిథిల భవనాల్లోకి వర్షం నీరు చేరడంతో రికార్డులను అద్దె గదిలో ఉంచుతున్నారు. ఇక వైద్యులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తుండగా, పశువులను వైద్యానికి తీసుకువచ్చేందుకు రైతులు జంకుతున్నారు.

నేడో.. రేపో కూలేందుకు సిద్ధంగా..

- శిథిలావస్థలో పశు వైద్యశాలలు
- పట్టించుకోని అధికారులు





రమణక్కపేట, ముసునూరులోని పశువైద్యశాలలు ఇలా..

ముసునూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ముసునూరులో వైద్యశాల స్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతుండటంతో సిబ్బంది బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. గోడలు బీటలు వారి అచ్చులుగా పడిపోతున్నాయి. కొద్దిపాటి వర్షానికే స్లాబ్ నుంచి నీరు గదుల్లో చేరుతోందని, మందులు, రికార్డులు, వ్యాక్సిన్, గడ్డి విత్తనాలు తదితర వాటిని భద్రపరుచుకునేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వైద్య సిబ్బంది వాపోతున్నారు. పశువుల్ని తీసుకువచ్చే రైతులు సైతం ఈ భవనంలో నిలబడేందుకు జంకుతున్నారని తెలిపారు. మండలంలో పశువులకు అత్యవసర చికిత్స ఈ వైద్యశాల నుంచే చేయాల్సి ఉందని, ఆసుపత్రి భవనం ప్రమాద స్థితిలో ఉన్నా నేటికి పట్టించుకున్న నాథుడే లేడని పాడి రైతులు అంటున్నారు.

● రమణక్కపేట, గోపవరం గ్రామాల్లోని పశు వైద్యశాల భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. చెట్టు కింద సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. మందులు, రికార్డులను తదితర వాటిని అద్దె గదిలో ఉంచుతున్నారు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ భవనాలు మరింత ప్రమాదకరంగా మారాయని పాడి రైతులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని రైతులు, వైద్య సిబ్బంది కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపినా...

శిథిలావస్థకు చేరిన పశువైద్యశాలల్లో విధులు నిర్వర్తించాలంటే వైద్య సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. నూతన భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను పంపాం. నేటికీ నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరైయితే వెంటనే భవనాలు నిర్మిస్తాం.

-ఎం.వెంకట చైతన్య, పశువైద్యాధికారి, ముసునూరు.

ఆధ్యాత్మికం

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ముదినేపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురజ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ సోమవారం జరుగనుంది. ఈ సందర్భంగా ఆలయంలో ఆదివారం యాజ్ఞికుడు సోమ రాజుపల్లి ఈశ్వర నాగ కుమార శర్మ ఆధ్వర్యంలో పలువురు అర్చకులు వాస్తు పూజ, జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, శాంతి హోమం, పుష్పాధివాసం కార్యక్రమాలను జరిపారు. యాగశాలలో కలశ పూజలు, హోమాలను పలువురు దంపతులు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యెర్నేని వెంకట సుబ్బారావు, కార్యదర్శి వీరిశెట్టి నాగమల్లేశ్వరరావు, కోశాధికారి జాస్తి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో గంగానమ్మ విగ్రహంతో పాటు పోతురాజు, నాగబంధం, సింహవాహనం ప్రతిష్ఠకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.



గంగానమ్మవారికి క్షీరాధివాసం

ఘనంగా దుర్గమ్మ జాతర

కలిదిండి: అప్పారావుపేటలో దుర్గమ్మ జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేడి నైవేద్యాలు సమర్పించి భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. పెదలంక సర్పంచ్ మోకా లక్ష్మీ రామకృష్ణ, కలిదిండి డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస చక్రవర్తి, మాజీ సర్పంచ్ పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ ఆలయం కిటకిట..

కైకలూరు: కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని పాలపొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆదివారం పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ఆవరణ కిక్కిరిసిపోయింది. ఆలయ ధ్వజస్తంభం వద్ద విశేషపూజలను జరిపారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు

ముదినేపల్లి: సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి యున్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నుంచే కాక పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు పాల పొంగళ్లు సమర్పించి, పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ గంగా శ్రీదేవి పర్యవేక్షణలో అర్చకులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బాబాజీ మఠంలోని నాగేంద్రుడికి భక్తులు పూజలు జరిపారు.

భార్యపై హత్యాయత్నం చేసిన భర్తకు జైలు, జరిమానా

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): భార్యపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన భర్తకు ఎనిమిదేళ్ల జైలు, రూ.5 వేల జరిమానా విధిస్తూ తాడేపల్లిగూడెం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె. మాధవి తీర్పు చెప్పారు. తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంటకు చెందిన నక్క ప్రమీలకు కలిదిండి మండలం సంతోషపురానికి చెందిన నక్క శ్యాంబాబుకు 2019లో వివాహమైంది. కొద్దిరోజులు తరువాత మద్యానికి బానిసై భార్యను తరచూ హింసించే వాడు. హింస భరించలేక ఆమె పుట్టింటికి వచ్చేయగా 2021లో ఆగస్టులో నిద్రిస్తున్న ఆమెపై కత్తితో దాడిచేయగా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు భర్త శ్యాంబాబు, అత్త మామలపై బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తులో భర్త శ్యాంబాబుపై నేరం రుజువు కావడంతో ఎనిమిదేళ్ల జైలు, రూ.5 వేల నగదు జరిమానా విధించారు. కేసు దర్యాప్తులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుసులూరి శివ రామకృష్ణ, సీఐ రమేష్, ఎస్‌ఐ జేవీఎన్ ప్రసాద్ దర్యాప్తుకు సహకరించారు.